PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

Published From : Rangareddy VOLUME : 01 Issue : 252 Sunday, 30-08-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు CM NEWS TV టీవీ కోసం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
హైదరాబాద్ & అమరావతి
మరియు జిల్లాల వ్యాప్తంగా కావలెను.

CM NEWS For The People

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, రాజకీయ మరియు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు జిల్లా స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

7396122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com

# సర్ గడువు పెంచండి

## నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు అదనంగా నాలుగు వారాల సమయం ఇవ్వండి




- సుమారు 93 లక్షల మంది ఓటర్లకు తాకీదులు జారీ చేయాల్సిన పరిస్థితి
- నోటీసులు ఇవ్వకుండా ఓట్లు తొలగించొద్దు
- గ్రామాల్లో ముసాయిదా ఓటరు జాబితాను కనీసం రెండుసార్లు చదివి వినిపించాలి
- అర్హులైన ఒక్కరి పేరునూ తొలగించొద్దు
- 'సర్'కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి లేఖ

హైదరాబాద్

రాష్ట్రంలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఆర్ఆర్) కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగించకుండా చూడాలని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకుండదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో సిఎం

-మిగతా 3 లో



03

## సినీ కార్మికులకు ఏఐ దెబ్బ

- జూనియర్ ఆర్టిస్టుల అవకాశాలను మింగేస్తున్న ఏఐ
- 300 మంది అవసరమైన సీన్‌కు 60 మందితోనే షూటింగ్
- డిజిటల్ జనసమూహాలతో పెరుగుతున్న వీఎఫ్ఎక్స్ వినియోగం
- రోజువారీ కూలీపై ఆధారపడే సినీ కార్మికులకు కొత్త కష్టం
- చిన్న పాత్రలే పెద్ద నటులుగా ఎదిగే మార్గానికి ముప్పు
- 'రామాయణ' ట్రైలర్‌తో వెలుగులోకి వచ్చిన డిజిటల్ క్రౌడ్
- తెరపై జనసందోహం.. సెట్లో మాత్రం కొద్దిమందే
- టెక్నాలజీ మార్పులతో ఉపాధి కోల్పోయే భయం



## ప్రాణహితకు పునరుజ్జీవం

- సెప్టెంబర్ 1న ఢిల్లీలో తెలంగాణ--మహారాష్ట్ర కీలక అంతర్రాష్ట్ర చర్చలు
- సీడబ్ల్యూసీ చైర్మెన్ నేతృత్వంలో జల సంప్రదింపులు
- 152 మీటర్ల ఎత్తు సాధ్యమైతే సుందిళ్లకు 80 టీఎంసీల ప్రాణహిత జలాలు
- ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డిలో కోల్పోయిన ఆయకట్టుకు భరోసా
- రాష్ట్ర జల ప్రయోజనాల పరిరక్షణలో రాజీ లేదు : మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్

డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును పునరుజ్జీ వింపజేసి, అసలు పథకంలో తెలంగాణ రైతాంగానికి ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే తెలంగాణ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు 80

-మిగతా 3 లో

## సీఎంలు బంగారం... ఎమ్మెల్యేలు బ్యాడ్..!



03


- యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో సర్వేలు వెల్లడి
- యోగి సర్కారుపై 41.8 శాతం ఓటర్లు సంతృప్తి
- యూపీ ఎమ్మెల్యేలపై 49 శాతం అసంతృప్తి
- మళ్లీ సీఎంగా యోగికి 43 శాతం మద్దతు
- పంజాబ్‌లో మాన్ సర్కారుపై 40 శాతం సంతృప్తి
- ఎమ్మెల్యేలపై 45.3 శాతం అసంతృప్తి
- మళ్లీ సీఎంగా మాన్ వైపు పంజాబ్ ఓటర్లు మొగ్గు
- ఉత్తరాఖండ్‌లో సగం మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి
- వచ్చే ఏడాది మూడు రాష్ట్రాలకు ఎన్నికలు

## నేపాల్‌లో హృదయ విదారకం



03

- బురద మేటలు.. ఆరని కన్నీళ్లు!
- ఒక్కొక్కరిది ఒక్కోవిషాద గాథ
- వరద మృతులు 682
- 2,426 మంది గల్లంతు
- పునర్ నిర్మాణానికి 5 బిలియన్ డాలర్లు
- భారత్, చైనాలు సాయం చేయాలి
- నేపాల్ ఆర్థిక మంత్రి అభ్యర్థన




## 7 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు

- సభ్యులకు కార్యదర్శుల నుంచి ప్రత్యేక లేఖలు
- వారం రోజులపాటు సమావేశాలు నిర్వహించే అవకాశం
- బీఏసీ భేటీలో సమావేశాల వ్యవధిపై నిర్ణయం
- సర్కారును ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాల వ్యూహం
- ప్రతిపక్షాల విమర్శలకు సభా వేదికగా బదులివ్వనున్న అధికారపక్షం
- సమావేశాలకు ముందే మరోసారి మంత్రివర్గ భేటీ
- అసెంబ్లీ భవన మరమ్మతులు ముమ్మరం
- పార్లమెంటు సెంట్రల్ హాల్ తరహాలో కొత్త ఏర్పాట్లు

హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు సెప్టెంబరు 7 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు కార్యదర్శులు శాసనస భ్యులు, శాసనమండలి సభ్యులకు ప్రత్యేకంగా లేఖలు రాశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సభ్యులకు సమాచారం పంపారు. వర్షాకాల సీజన్ ఎన్ని రోజులు సమావేశాలు జరపాలనే విషయమై బీఏసీ సమావేశంలో నిర్ణయిస్తారు. ఎనిమిదో విడతకు సంబంధించి రెండో సమావేశాలు కావడం గమనార్హం. ఈ సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి చేరుకోవడంతో సమావేశాలను

-మిగతా 3 లో



## ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- డ్రోన్ దాడితో భారీ విధ్వంసం
- కీవ్ ప్రాంతంలో 37 మంది మృతి, 42 మందికి గాయాలు
- పిల్లలు సహా వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- నివాస భవనాలు, దుకాణాలు, వాహనాలకు తీవ్ర నష్టం
- రష్యాకు శిక్ష తప్పదని జెలెన్‌స్కీ హెచ్చరిక
- అత్యవసర సహాయక చర్యలు ని ముమ్మరం చేసిన ఉక్రెయిన్ ప్రభుత్వం

# సీఎంతో విభేదాల్లేవ్

### రాహుల్‌ను ప్రధానిని చేయడమే మా ఇద్దరి లక్ష్యం

- సీఎంపై సుస్మిత వ్యాఖ్యలు బాధ కలిగించాయి
- కొండా సురేఖ, చిన్నారెడ్డిపై నిర్ణయం అధిష్టానానిదే
- మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్



హైదరాబాద్,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు విభేదాలు లేవని, ఇద్దరం సమన్వయంతో పార్టీని ముందుకు నడిపిస్తున్నామని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలన్నదే ఇద్దరి లక్ష్యమని చెప్పారు. సీఎంపై కొండా సురేఖ కూతురు సుస్మిత పటేల్ చేసిన విమర్శలు తనకు బాధ కలిగించాయని వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖ, పార్టీ సీనియర్ నేత చిన్నారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ అన్ని కోణాల్లో పరిశీలించి

-మిగతా 3 లో


## ఖర్గే ర్యాలీ చేసిన ప్రదేశంలో శుద్ధి

- అంటరానితనానికి నిదర్శనమన్న కాంగ్రెస్ అగ్రనేత
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరిపై తీవ్ర విమర్శలు
- ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్
- నిందితులపై చర్యలకు ప్రధాని చొరవ చూపాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరిన రాహుల్
- చర్యలు లేకుంటే మరింత తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరిక

న్యూఢిల్లీ

కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఒక ర్యాలీ కోసం ఖర్గే పాల్గొన్న వేదికను శుభ్రం చేయడాన్ని రాహుల్ తప్పుబట్టారు. అలా చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు.

-మిగతా 3 లో



vaartha sandhya వార్త సంధ్య
vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

# మాధవరం కృష్ణారావుపై బండి రమేష్ తీవ్ర ధ్వజం

-ముఖ్యమంత్రిపై పిచ్చి ప్రేలాపనలు చేస్తే సహించేది లేదు"





**వర్త సంధ్య కూకట్‌పల్లి :**
కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నోరు అదుపులో పెట్టుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పిచ్చి ప్రేలాపనలు చేస్తే సహించేది లేదని కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌ఛార్జ్ బండి రమేష్ తీవ్రంగా హెచ్చరించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని బండి రమేష్ పేర్కొన్నారు. ఎన్నికల హామీలతో పాటు ప్రజలకు అవసరమైన మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు 22ఏ నిబంధన కింద ఉన్న ప్రైవేట్ ఆస్తులను తొలగించి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు అధికార యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు.

తెలంగాణలో గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టారని, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ల కక్కుర్తితో 'కూలేశ్వరం'గా మారిందని ఎద్దేవా చేశారు. దీనిపై కేటీఆర్, హరీష్ రావు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.

**మహానగర విస్తరణే ధ్యేయం**

'రైజింగ్ తెలంగాణ' పేరుతో సీఎం రేవంత్ రెడ్డి అద్భుత పాలన అందిస్తున్నారని, హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలబెట్టేందుకు గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఫోర్త్ సిటీ ఏర్పాటుతో మహానగరాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మహిళా అభ్యున్నతి, రైతుల సంక్షేమం, విద్యా వ్యవస్థ బలోపేతం, యువతకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. కేంద్రం సహకరించినా, లేకున్నా మెట్రో రెండో దశను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యే అక్రమాలపై విమర్శల వర్షం**

ప్రభుత్వ భూములను కబ్జా చేసి పేదలకు అమ్ముకుని, అక్రమ ఆస్తులు సంపాదించడానికి ఎమ్మెల్యే కృష్ణారావు అలవాటుపడ్డారని బండి రమేష్ ఆరోపించారు. కౌన్సిలర్‌గా ఉన్నప్పటి నుండి ఎమ్మెల్యేగా గెలిచినంత వరకు ఆయన ఆస్తులు విపరీతంగా పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.

ఈ సందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు:

– అల్లాపూర్ సర్వే నంబర్ 18లోని 2.17 ఎకరాల భూమిని ఎవరు కబ్జా చేశారు?

– హస్మత్‌పేట సర్వే నంబర్ 1లోని 100 ఎకరాల భూమి 10-12 ఎకరాలకు ఎందుకు కుంచించుకుపోయింది?

– గోపాల్‌నగర్‌లో పార్కులను అన్యాక్రాంతం చేయడం, అక్రమ నిర్మాణాల వద్ద డబ్బులు వసూలు చేయడం, చెరువుల వద్ద బోర్లు వేసి నీళ్లు అమ్ముకోవడం నిజం కాదా?

కాంగ్రెస్‌లోకి రావాలని ఎవరూ బతిమిలాడలేదు

కాంగ్రెస్ పార్టీలో చేరనందుకే తనపై కక్ష సాధిస్తున్నారన్న ఎమ్మెల్యే విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. "140 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి నువ్వు వస్తే ఎంత, రాకపోతే ఎంత? నిన్ను బతిమిలాడాల్సిన అవసరం మాకు లేదు" అని స్పష్టం చేశారు. కబ్జాలు, అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను వేధిస్తున్న వారికి ప్రజా గ్రహం తప్పదని పేర్కొన్నారు. గెలుపోటములు సహజమని, ఎన్నికల మరుసటి రోజు నుంచే తాను ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి కోసం పాటుపడుతున్నానని వెల్లడించారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలన, కాంగ్రెస్ 2.5 ఏళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని కృష్ణారావుకు సవాల్ విసిరారు. సంకుచిత స్వభావాన్ని పక్కనబెట్టి అభివృద్ధిలో పోటీపడాలని హితవు పలికారు.

ఈ విలేకరుల సమావేశంలో నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు మరియు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం



**రామగిరి,(వార్త సంధ్య) ఆగస్టు 29.**
జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిత్యం ఏదో ఒక ఆటను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన క్రీడా సౌకర్యాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటల్లో పాల్గొనే విద్యార్థినుల సంఖ్య పెరగాలని సూచించారు. విద్యార్థులకు షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్, చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సుమన్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, జి. సునీల్, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోచన్నపేట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా అక్కిరెడ్డి శ్రీధర్






**బచ్చన్నపేట (వార్త సంధ్య) ఆగస్టు 29.**
మండలంలోని పోచన్నపేట గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అక్కిరెడ్డి శ్రీధర్, వరుసగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి శ్రీధర్ అందించిన సేవలను గుర్తించిన కార్యకర్తలు మరోసారి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అక్కిరెడ్డి శ్రీధర్ మాట్లాడుతూ. తనపై నమ్మకం ఉంచి వరుసగా రెండోసారి గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్న కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుని పోచన్నపేటలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి మసూద్, జిల్లా నాయకులు దత్రపు నరేష్, జిల్లా సందీప్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల మహేందర్, గుట్ట చైర్మన్ ఈదులకంటి వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షుడు ఎద్దు హరీష్, కొయ్యడి శ్రీనివాస్, రామిని మదన్మోహన్, సద్ది నర్సిరెడ్డి, గుర్రపు బాలరాజు, చెరుకూరి శ్రీనివాస్, కన్రాజ్ రవీందర్, నీల రమేష్, కొక్కలకొండ బాబు, బొట్టు గణపతి తదితరులు పాల్గొన్నారు.

## ఏజీఎం పల్లెర్ల నాగేశ్వరరావుకు ఘన వీడ్కోలు

- పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆర్జీ-3 జీఎం మధుసూదన్, తిరుపతి యాదవ్



**రామగిరి, (వార్త సంధ్య) ఆగస్టు 29.**
రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని (జచీ జూూ) క్లబ్‌లో రామగుండం రీజియన్ సివిల్ క్వాలిటీ కంట్రోల్ సెల్ అడిషనల్ జనరల్ మేనేజర్ పల్లెర్ల నాగేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 జనరల్ మేనేజర్ సుంకరి మధుసూదన్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ పాల్గొని పల్లెర్ల నాగేశ్వరరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పల్లెర్ల నాగేశ్వరరావు చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సంస్థకు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఉద్యోగ జీవితంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్ లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య ఐ ఎన్ టి యు సి నాయకులు నాయకులు బెల్లం శ్రీనివాస్, సివిల్ కాంట్రాక్టర్స్, సింగరేణి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాల దరఖాస్తులకు ఆహ్వానం

**2026-27 విద్యా సంవత్సరం బీడీ, సినీ కార్మికుల పిల్లలకు సువర్ణ అవకాశం**



**రంగారెడ్డి/హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు (వార్త సంధ్య) ఆగస్టు 29.**
కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందించే బీడీ, సినీ కార్మికుల పిల్లలకు ప్రోత్సాహక ఉపకార వేతనాలకు కేంద్ర కార్మిక, మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సినీ కార్మిక సంక్షేమ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ పి. సింధూర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. సింధూర మాట్లాడుతూ... 2026-27 విద్యా సంవత్సరానికి చెందిన ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పై అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోగా, అలాగే పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి ఇంటర్మీడియట్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు చదువుతున్న విద్యార్థులందరూ అక్టోబర్ 31వ తేదీ లోపు దరఖాస్తులు ఆన్లైన్ లో సూచించారు. సినీ విద్యార్థుల కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.1,00,000 రూపాయల నుంచి రూ.2,52,000 పెంచినట్లు తెలిపారు. అర్హులైన సినీ కార్మికుల పిల్లలకు ఆధార్ కార్డు అనుసంధానం ఉన్న బ్యాంకు ఖాతా ( ఎన్ పి సి ఐ సీడెడ్, డి బి టి ఎనబ్లెడ్) ఉండాల్సిందని అన్నారు. నేషనల్ స్కాలర్ షిప్ ఆన్లైన్ పోర్టల్ లో సందర్శించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహ ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థిని విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


## ప్రజా నోటీసు

**తేదీ: 30-08-2026**

సర్వసాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ లిశ్రీ శ్రీనివాస్ మొగిలిపాల, తండ్రి: చంద్రయ్య, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, కందుకూర్ మండలం, చిప్పలపల్లి గ్రామంలో ఉన్న సర్వే నం. 185/2, 185/21, మొత్తం విస్తీర్ణం ఎకరాలు 3-33 గుంటలులి, అన్ని ఈజ్‌మెంటరీ మరియు అనుబంధ హక్కులతో కూడిన వ్యవసాయ భూమిని కొనుగోలు చేయదలచినారు.
ప్రతిపాదిత విక్రేతలు క్రింది టైటిల్ డీడ్ పత్రాల ఆధారంగా సదరు ఆస్తికి సంపూర్ణ హక్కుదారులుగా పేర్కొంటున్నారు:

1. ముదావత్ పురందాస్ (T05110011439):
Sy.No. 185/21/1/1/2 -- Ac.1-16 Guntas
Sy.No. 185/2/AA1/1/2/1/2 -- Ac.0- 02 Guntas
Sy.No. 185/21/1/1/1/2 -- Ac.0-02 Guntas.

2. ముదావత్ పవన్ (T05110011277):
Sy.No. 185/21/1/3 -- Ac.1-00 Guntas
Sy.No. 185/2/AA1/1/2/1/1 -- Ac.0- 06 Guntas.

3. కోడవత్ శ్రీను (T05110010602):
Sy.No. 185/21/1/2/2 -- Ac.0-04Guntas.

4. మేఘవత్ రవి (T05110011132):
Sy.No. 185/21/1/2/1/2 -- Ac.0-08 Guntas.

5. ముదావత్ రాజు (T05110011275):
Sy.No. 185/21/1/2/1/1 -- Ac.0-29 Guntas
Sy.No. 185/2/AA1/1/2/2 -- Ac.0-02 Guntas
Sy.No. 185/2/AA1/1/1 -- Ac.0-03 Guntas.

6. ముదావత్ మంగ్లీ (T05110011543):
Sy.No. 185/21/1/1/1 -- Ac.0-01 Guntas.

**ఆస్తి వివరాలు**
చిప్పలపల్లి గ్రామం, కందుకూర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణలో ఉన్న Ac.3-33 Guntas వ్యవసాయ భూమి

Date : 30-08-2026

**Public Notice**

Notice hereby given to the general public notice that my client **Sri. Srinivas Mogilipala, S/o. Chandraiah** propose to purchase the property bearing survey no. 185/2, 185/21 admeasuring **Ac. 3 - 33 Guntas** situated at Chippalapally Village, Kandukur Mandal, Ranga Reddy District, Telangana together with all easementary and appurtenant rights.

The proposed vendor claims to be the absolute owner of the said property virtue of title deed documents Document Nos. and Extents along with Survey Nos. are below

1. **Mudawath Purandas (T05110011439)** : Sy. No. 185/21/1/1/2- Ac. 1-16 Guntas, Sy. No. 185/2/AA1/1/2/1/2- Ac. 0-02 Guntas, Sy. No. 185/21/1/1/1/2 – Ac. 0-02 Guntas,
2. **Mudawath Pawan (T05110011277)** : Sy. No. 185/21/1/3 – Ac. 1-00 Guntas, Sy. No. 185/2/AA1/1/2/1/1 – Ac. 0-06 Guntas,
3. **Kodavath Srinu (T05110010602)** : Sy. No. 185/21/1/2/2 – Ac. 0-04 Guntas,
4. **Meghavth Ravi (T05110011132)** : Sy. No. 185/21/1/2/1/2 - Ac. 0-08 Guntas,
5. **Mudavath Raju (T05110011275)** : Sy. No. 185/21/1/2/1/1- Ac.0-29 Guntas, Sy. No. 185/2/AA1/1/2/2- Ac. 0-02 Guntas, Sy. No. 185/2/AA1/1/1 – Ac. 0-03 Guntas,
6. **Mudavath Manglee (T05110011543)** : Sy. No. 185/21/1/1/1 – Ac. 0-01 Guntas.

**Schedule of Property**

**All that agricultural land Ac. 3-33 Guntas, Chippalapally Village, Kandukur Mandal, Ranga Reddy District, Bounded By:**

**North : Neighbours Property**
**South : 20 feet Road,**
**East : Neighbours Property,**
**West : Neighbours Property.**

**Advocate :**
**G Laxma Reddy,**
**9492032143.**
**If any objections please contact for the above number.**

**హద్దులు:**
ఉత్తరం: పొరుగు వారి ఆస్తి
దక్షిణం: 20 అడుగుల రోడ్డు
తూర్పు: పొరుగు వారి ఆస్తి
పడమర: పొరుగు వారి ఆస్తి

పై ఆస్తిపై ఎవరికైనా లిహక్కు, టైటిల్, ఆసక్తి, క్లెయిమ్ లేదా అభ్యంతరంలి ఉన్నట్లయితే, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోపు క్రింద పేర్కొన్న న్యాయవాదిని సంప్రదించవలెను. లేనిపక్షంలో, ఎటువంటి అభ్యంతరాలు లేనట్లుగా భావించి ప్రతిపాదిత కొనుగోలు లావాదేవీని కొనసాగించబడును.

**న్యాయవాది:**
**జి. లక్ష్మా రెడ్డి**
**ఫోన్: 9492032143**

వార్త సంధ్య

# ఉక్రెయిన్‌పై రష్యా దాడి


**-డ్రోన్ దాడితో భారీ విధ్వంసం**
**-కీవ్ ప్రాంతంలో 37 మంది మృతి, 42 మందికి గాయాలు**
**-పిల్లలు సహా వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు**
**-నివాస భవనాలు, దుకాణాలు, వాహనాలకు తీవ్ర నష్టం**
**-రష్యాకు శిక్ష తప్పదని జెలెన్స్కీ హెచ్చరిక**
**-అత్యవసర సహాయక చర్యలు ముమ్మరం చేసిన ఉక్రెయిన్ ప్రభుత్వం**



కీవ్: ఉక్రెయిన్‌లోని కీవ్ ప్రాంతంపై రష్యా జరిపిన దాడిలో మృతుల సంఖ్య 37కు పెరిగిందని అధికారులు శనివారం తెలిపారు. ఖార్కీవ్ జిల్లాలోని హెచ్‌ఆర్ గ్రామంలో రింగ్‌రోడ్డుపై శుక్రవారం సాయంత్రం సుమారు ఏనిమిది గంటలకు రష్యా డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడి కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగి అత్యవసర సేవల సిబ్బంది తక్షణమే మంటలను అదుపు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. రింగ్‌రోడ్‌లో పలు వాహనాలు దెబ్బతినడం, షాప్‌లు దెబ్బతిన్నాయని అధికారులు పేర్కొన్నారు. కీవ్ ప్రాంతానికి చెందిన పరిపాలన అధిపతి క్రైరిక్ టిమోషెంకో వివరాలను వెల్లడించారు. రింగ్‌రోడ్డుపై దాడి జరిగి పలువురు గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తెలిపారు. రష్యాకు తగిన శిక్ష తప్పదని ప్రతీకార హెచ్చరిక చేశారు. కీవ్‌లోని నివాస భవనాలు, మౌలిక సదుపాయాల కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇళ్లు, నివాస ప్రాంతాలు దగ్గం కాకుండా సామగ్రి దెబ్బతినకుండా నిరోధక నిబంధనలు ఉన్నాయని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికార యంత్రాంగం అత్యవసర ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. మృతుల సంఖ్య 20కి పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరో 42 మంది వివిధ ప్రాంతాల్లో గాయపడ్డారు. వీరిలో పలువురు పిల్లలు ఉన్నారు. గాయపడిన వారందరికీ వైద్య సాయం అందించారు. ఏడుగురిని ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాద ప్రాంతం నుండి 381 మందిని తరలించారు. వీరిలో 59 మంది పిల్లలు ఉన్నారు. దాదాపు 50 నివాస భవనాలు దెబ్బతిన్నాయని ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. కమ్యూనిటీ సమాజ అధిపతి తారాస్ విటోవ్ మృతుల్లో ఉన్నారు. ఆయన సాయం అందించేందుకు ముందుగా స్థలానికి చేరుకున్న వేళ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. కమ్యూనిటీలో కార్యాలయం కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రాథమిక వైద్య సహాయం, ఆహారం, మానసిక సేవలు పొందవచ్చు. వైద్యుల రక్షణ, అత్యవసర, శోధన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. స్థానిక పోలీసులు, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

# సినీ కార్మికులకు ఏఐ దెబ్బ

**-జూనియర్ ఆర్టిస్టుల అవకాశాలను మింగేస్తున్న ఏఐ**
**-300 మంది అవసరమైన సీన్‌కు 60 మందితోనే షూటింగ్**
**-డిజిటల్ జనసమూహాలతో పెరుగుతున్న వీఎఫ్ఎక్స్ వినియోగం**
**-రోజువారీ కూలీపై ఆధారపడే సినీ కార్మికులకు కొత్త కష్టం**
**-చిన్న పాత్రలే పెద్ద నటులుగా ఎదిగే మార్గానికి ముప్పు**
**-'రామాయణ' ట్రైలర్‌తో వెలుగులోకి వచ్చిన డిజిటల్ క్రౌడ్**
**-తెరపై జనసందోహం.. సెట్లో మాత్రం కొద్దిమందే**
**-టెక్నాలజీ మార్పులతో ఉపాధి కోల్పోయే భయం**



న్యూఢిల్లీ : వాస్తవానికి ప్రతి నటుడికీ ఓ కథ ఉంటుంది. మిథున్ చక్రవర్తి 1970వ దశకం మధ్యలో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేసిన వారే. నవాజుద్దీన్ సిద్ధికీ 'స్కూల్' అనే చిత్రంలో వెయిటర్‌గా ఓ చిన్న పాత్ర వేశారు. ఆ తర్వాత అనేక ఏండ్ల పాటు చిన్న చిన్న వేషాలు, గుర్తింపు లేని పాత్రలు ధరించారు. పంకజ్ త్రిపాఠీ కూడా చిన్న పాత్రలతో సినీ కెరీర్‌ను ప్రారంభించి హిందీ సినిమాకు అత్యంత గుర్తింపు తెచ్చిన నటుల్లో ఒకరయ్యారు. ఇక ఇటీవలి కాలంలో మిహిర్ అహుజాదీ అదే దారి. హృతిక్ రోషన్ నటించిన 'సూపర్ 30'లో ఆయన ఓ చిన్న వేషం వేశారు. ఇప్పుడాయన ప్రేక్షకులకు బాగా సుపరిచితుడైన నటుడు. కల్పలత గుర్తున్నారా ? రాజమౌళి 'బాహుబలి'లో ఎక్స్‌ట్రాగా చేశారు. మాహిష్మతి నివాసితుల్లో ఆమె ఒకరు... అంతే. సినిమాలో ప్రధాన పాత్ర పోషించకపోయినప్పటికీ మంచి గుర్తింపు పొందారు. ప్రేక్షకులతో పాటు నిర్మాతల దృష్టిలో పడిన కల్పలత సాలార్, పుష్ప వంటి చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించారు.

**రోజు గడిస్తే చాలు**

పెద్ద స్టార్‌గా వెలుగొందాలని ముంబయి చిత్రసీమలోని వేలాది మంది వర్ధమాన నటులు, జూనియర్ ఆర్టిస్టులు, ఎక్స్‌ట్రాలకు ఆశలేమీ లేవు. ఎలాగైనా సినీరంగంలోకి ప్రవేశిస్తే చాలు అని వారు అనుకుంటారు. అయితే చాలామందికి ఏండ్లు గడిచినా ఆ కల నెరవేరదు. దీనికి కారణం ఏఐ అంటే ఆశ్చర్యం కలుగుతుంది కదూ. 300 మంది అవసరమయ్యే సన్నివేశాన్ని కేవలం 60 మందితో తీసేయవచ్చు. మిగిలిన పని అంతా డిజిటల్‌గా పూర్తవుతుంది. అప్పుడు మిగిలిన 240 మంది పరిస్థితి ఏమిటి? గుంపులో గోవింద మాదిరిగా సినిమాలో ఒక్క మాట కూడా మాట్లాడే అవకాశం రాని వారు ఎందరో ఉంటారు. అయినా వారు ఇప్పటికీ ముంబయి మహా నగరంలో జీవనాన్ని నెట్టుకొచ్చేందుకు ఈ రోజు గడిస్తే చాలునన్న ఆశతో రోజువారీ వేతనాలపై ఆధారపడుతున్నారు.

# ప్రాణహితకు పునరుజ్జీవం

మొదటి తరువాయి

టీఎంసీల ప్రాణహిత జలాలను భారీ ఎత్తిపోతల అవసరం లేకుండా సహజ గురుత్వాకర్షణ ద్వారా సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ--మహారాష్ట్ర మధ్య జరగనున్న కీలక అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం సాయంత్రం ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్–ఇన్–చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబుతో పాటు నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఢిల్లీ సమావేశంలో తెలంగాణ తరఫున వినిపించాల్సిన సాంకేతిక, న్యాయపరమైన వాదనలు, 152 మీటర్ల బ్యారేజీ వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గురుత్వాకర్షణ ద్వారా నీటి తరలింపు సాధ్యాసాధ్యాలను కూలంకషంగా సమీక్షించారు. రెండు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలకు కేంద్రం వేదిక కల్పించిన నేపథ్యంలో తెలంగాణ జల ప్రయోజనాలను బలమైన సాంకేతిక ఆధారాలతో ప్రతిపాదించేందుకు ఈ సన్నాహక సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. సెప్టెంబర్ 1న జరిగే అంతర్రాష్ట్ర సమావేశానికి కేంద్ర జల సంఘం చైర్మెన్ అధ్యక్షత వహిస్తారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో పాటు సీడబ్ల్యూసీలోని కీలక డైరెక్టరేట్ల అధిపతులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయని వెల్లడించారు. తెలంగాణ--మహారాష్ట్ర మధ్య అధికారిక చర్చల ప్రక్రియ ప్రారంభం కావడమే ప్రాణహిత పునరుజ్జీవంలో ఒక కీలక ముందడుగని మంత్రి అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం, నీటిపారుదల శాఖ కేంద్రంతో నిరంతరం జరిపిన సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితంగానే ఈ చర్చలకు మార్గం సుగుమమైందన్నారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రైతాంగానికి మొదట ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ద


# 7 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు

మొదటి తరువాయి

కనీసం వారం రోజులపాటు నిర్వహించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. జెన్ జీలను అసెంబ్లీ, పార్లమెంటుకు పోటీచేసేలా అర్హతలను సవరించే బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపాదించే అవకాశాలు లేకపోలేదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అసెంబ్లీ సమావేశాల కంటే ముందు మరోసారి మంత్రివర్గ సమావేశం జరగనుంది. సర్కారుపై ప్రతిపక్షాలు విరివిగా విమర్శలకు దిగుతున్న నేపథ్యంలో సమావేశాల ద్వారా గుణపాఠం చెప్పేందుకు అధికారపక్షం ఈ సమావేశాలను ఉపయోగించుకునే అవకాశం కనిపిస్తున్నది. ఇదిలావుండగా బీఆర్ఎస్ సైతం ఈ సమావేశాల్లో సర్కారును ఇరుకున పెట్టాలని భావిస్తున్నది. సమావేశాలు ప్రారంభం రోజున జరిగే బీఏసీలో ఎన్ని రోజులు అసెంబ్లీ, మండలి జరగనున్నాయనే విషయమై స్పష్టత రానుంది. ఈమేరకు అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతి, మండలి కార్యదర్శి డాక్టర్ నరసంహచారి సన్నాహాలు ప్రారంభించారు. గత కొన్ని నెలలుగా అసెంబ్లీ భవనానికి మరమ్మతులు జరుగుతున్న సంగతి తెలిసిందే. తొలిసారిగా పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో తరహాల అసెంబ్లీలో కూడా ఏర్పాట్లు జరుగుతున్నది. మరమ్మతులు వేగంగా పూర్తిచేసే పనిలో అధికారయంత్రాంగం ఉంది.

# సీఎంలు బంగారం... ఎమ్మెల్యేలు బ్యాడ్..!

**- యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో సర్వేలు వెల్లడి**
**-యోగి సర్కారుపై 41.8 శాతం ఓటర్లు సంతృప్తి**
**--యూపీ ఎమ్మెల్యేలపై 49 శాతం అసంతృప్తి**
**-- మళ్లీ సీఎంగా యోగికి 43 శాతం మద్దతు**
**-- పంజాబ్‌లో మాన్ సర్కారుపై 40 శాతం సంతృప్తి**
**-- ఎమ్మెల్యేలపై 45.3 శాతం అసంతృప్తి**
**--మళ్లీ సీఎంగా మాన్ వైపు పంజాబ్ ఓటర్లు మొగ్గు**
**-- ఉత్తరాఖండ్‌లో సగం మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి**
**-- వచ్చే ఏడాది మూడు రాష్ట్రాలకు ఎన్నికలు**



న్యూఢిల్లీ:

2027 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఓటర్లు ముఖ్యమంత్రుల కంటే తమ ప్రాంత ఎమ్మెల్యేలపై ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సర్వేలు వెల్లడించాయి. వోట్ వైబ్ సర్వే ప్రకారం ఈ మూడు రాష్ట్రాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ప్రభుత్వాలపై కంటే ఎక్కువగా ఉంది. అయితే ఈ నియోజకవర్గ స్థాయి అసంతృప్తి పాలక పార్టీలకు ఒకరీతిగా నష్టం కలిగించలేదని ఇండియా టుడే సీవోటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే సూచిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో ఎమ్మెల్యేలపై అసంతృప్తి అత్యధికంగా నమోదైంది. సర్వేలో పాల్గొన్నవారిలో 49 శాతం మంది తమ ప్రస్తుత ఎమ్మెల్యే పనితీరుపై పూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం 27.9 శాతం మంది మాత్రమే సంతృప్తి చెందారు. యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వంపై 41.8 శాతం సంతృప్తి, 38.4 శాతం అసంతృప్తి వ్యక్తమైంది. ముఖ్యమంత్రి ఎంపికలో యోగి ఆదిత్యనాథ్ 43 శాతం మద్దతుతో ముందున్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ 35.5 శాతంతో రెండో స్థానంలో ఉన్నారు. పంజాబ్‌లో కూడా ఎమ్మెల్యేలపై కోపం ప్రభుత్వంపై కంటే ఎక్కువగా ఉంది. భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై 40 శాతం సంతృప్తి, 35.4 శాతం అసంతృప్తి ఉంది. ఎమ్మెల్యేలపై అసంతృప్తి 45.3 శాతం, సంతృప్తి 32.2 శాతం మాత్రమే ఉంది. మాదకద్రవ్యాలు, నిరుద్యోగం, వలసలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. భగవంత్ మాన్ ముఖ్యమంత్రి ఎంపికలో బలమైన మద్దతు కలిగి ఉన్నారు. ఆయన పార్టీ ఓటు బ్యాంక్ కంటే వ్యక్తిగతంగా ముందున్నారు. ఉత్తరాఖండ్‌లో కూడా దాదాపు సగం మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై అసంతృప్తి తక్కువగా ఉంది. రాజకీయ విశ్లేషకులు ఎమ్మెల్యేలపై ఈ అసంతృప్తి 2027 ఎన్నికల్లో టికెట్ పంపిణీ, అభ్యర్థుల ఎంపికను ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు. ప్రజాదరణ లేని అభ్యర్థులను మార్చడం, తిరుగుబాటు అభ్యర్థుల ప్రమాదం పార్టీలకు సవాలుగా మారవచ్చు.

# నేపాల్‌లో హృదయ విదారకం

**-బురద మేటలు.. ఆరని కన్నీళ్లు!**
**- ఒక్కొక్కరిది ఒక్కోవిషాద గాథ**
**- వరద మృతులు 682**
**- 2,426 మంది గల్లంతు**
**- పునర్ నిర్మాణానికి 5 బిలియన్ డాలర్లు**
**- భారత్, చైనాలు సాయం చేయాలి**
**- నేపాల్ ఆర్థిక మంత్రి అభ్యర్థన**



ఖాట్మండ్/న్యూఢిల్లీ:

నేపాల్‌లో బుధవారం హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో, సునామీలా నీరు, బురద, శిథిలాలు భోటెకోశి, త్రిశూలి నదుల వెంటబడి ప్రవహించి గ్రామాలను ముంచెత్తాయి. ఆగస్టు 29 సాయంత్రం వరకు నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నవీకరణ ప్రకారం మొత్తం మృతుల సంఖ్య 682కి చేరింది. 2,426 మంది గల్లంతయ్యారు. వీరిలో 517 మంది విదేశీయులు, 933 మంది జలవిద్యుత్ ప్రాజెక్టు కార్మికులు ఉన్నారు. నేపాల్ సైన్యం, పోలీసు సిబ్బంది, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ సిబ్బంది కూడా గల్లంతయ్యారు. చిత్వాన్‌లో 233, రసువాలో 562, నువాకోట్‌లో 115 మంది గల్లంతయ్యారు. 101 మంది గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు 4,451 మందిని రక్షించారు. వారిలో 114 మంది భారతీయులు ఉన్నారు. ఇప్పటికీ కాంటాక్ట్‌లో లేని భారతీయులు 320 మంది ఉన్నారని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. 11 మందితో సహాయక బృందాన్ని పంపించినట్లు వెల్లడించింది. జలవిద్యుత్ సొరంగం నుంచి 191 మందిని, ఎయిర్‌లిఫ్ట్ ద్వారా 517 మందిని తరలించారు. అప్పర్ త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో 100 మందికి పైగా ఇంకా చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. 350 మందిని అక్కడి నుంచి బయటకు తీశారు. చిత్వాన్, నవల్పరాసి తూర్పు, గోర్ఖా, ధాడింగ్, నువాకోట్, తనహు, రసువా జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. భారత్‌లోని నదుల్లో నేపాల్ నుంచి కొట్టుకొచ్చిన ఏడు మృతదేహాలు దొరికాయి. 11 వేలకు పైగా సైనిక, పోలీసు సిబ్బంది రక్షణ పనుల్లో ఉన్నారు. భారత్ వైద్య, సొరంగ రక్షణ నిపుణుల బృందం సాయం అందిస్తోంది. మూడు సాయం విమానాలు ఖాట్మండు చేరుకున్నాయి. వర్షం హెలికాప్టర్ ఆపరేషన్లను ఆటంకపరుస్తోంది. కొత్త సరస్సు ఏర్పడి మళ్లీ వరద ముప్పు ఉందని హెచ్చరికలు ఉన్నాయి. రెడ్‌క్రాస్ అంచనా ప్రకారం 93 వేల మంది ప్రభావితమయ్యారు. ఆసుపత్రుల్లో బంధువులు గల్లంతైన వారి జాబితాలు చూస్తున్నారు. రక్షణ, శోధన పనులు నాలుగో రోజు కొనసాగుతున్నాయి.

సాంకేతిక సాయం కావాలి: నేపాల్ మంత్రి

ఇటీవలి వరదల వల్ల పునర్నిర్మాణానికి 4 బిలియన్ డాలర్ల నుంచి 5 బిలియన్ డాలర్ల వరకు అవసరమవుతాయని నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే పేర్కొన్నారు. ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని, నష్టం, నష్టపరిమాణం అంచనా వేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మొత్తం నేపాల్ ఆర్థిక వ్యవస్థలో దాదాపు పదో వంతుకు సమానం. 2015 భూకంపం తర్వాత అవసరమైన 9 బిలియన్ డాలర్ల కంటే తక్కువే అవసరమవుతుందని వాగ్లే అన్నారు. సాధారణ రక్షణ పనులకు సాయం అవసరం లేదని, సొరంగ రక్షణ, రవాణా, కమ్యూనికేషన్ పునరుద్ధరణ, మృతదేహాల గుర్తింపు, డిఎన్ఎ పరీక్షలు, శవాల నిల్వకు ప్రత్యేక సాంకేతిక సాయం కావాలని విదేశీ మంత్రి శిరూర్ ఖనాల్ చెప్పారు. భారత్, చైనా తాత్కాలిక వంతెనలు అందించాలని కోరారు.

# సర్ గడువుపెంచండి

మొదటి తరువాయి

రేవంత్‌రెడ్డి కోరారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారినా, మృతిచెందినా, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించినట్లు ముఖ్యమంత్రి ఈసీ గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని సిఎం పేర్కొన్నారు.

**పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదు**

మరొకవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయబడలేదని సిఎం ఈ లేఖలో తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఈ లేఖలో తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్‌లో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాను బహిరంగంగా చదివి వినిపించాలని సిఎం విజ్ఞప్తి చేశారు.

రోజువారీ కూలీలు, వలస కార్మికులకు నాలుగు వారాల సమయం ఇవ్వాలి

నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఈ లేఖలో కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో యని ముఖ్యమంత్రి ఈ లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని సిఎం పేర్కొన్నారు. నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటుగా నమోదు చేసుకునేందుకు ఫారం6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండా దానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి ఈ లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదని సిఎం ఈ లేఖలో తెలిపారు. దీనివల్ల ఓటు రోజున పోలింగ్ రోజాన కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సిఎం పేర్కొన్నారు.

సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాలి

హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మృతిచెందిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి ఈ లేఖలో తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్‌లో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాను బహిరంగంగా చదివి వినిపించాలని సిఎం విజ్ఞప్తి చేశారు.

# ఖర్గే ర్యాలీ చేసిన ప్రదేశంలో శుద్ధి

మొదటి తరువాయి




మల్లికార్జున ఖర్గే కొద్ది రోజుల క్రితం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఒక ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒక వేదిక నుంచి ప్రసంగించారు.అయితే, మరుసటి రోజు కొందరు బీజేపీ అనుకూల నాయకులు ఖర్గే పాల్గొన్న ఆ వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. శుద్ధీకరణ ప్రక్రియ చేపట్టారు. దీనిపై ఖర్గే మండిపడ్డారు. తాను పాల్గొన్న వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో అక్కడి బీజేపీ ప్రభుత్వంపై కూడా మండిపడ్డారు. తాజాగా ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడారు. ఖర్గే పాల్గొన్న వేదిక ఉన్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటరానితనానికి సూచనగా రాహుల్ అభివర్ణించారు. ఈ చర్య దళితులపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల వైఖరికి నిదర్శనం అన్నారు. దళితుల విషయంలో ఆ పార్టీ నేతలు ఎలా వ్యవహరిస్తారో తెలుస్తోందన్నారు. ఈ చర్యకు పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ప్రధాని చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ విషయంలో ప్రధాని మోదీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వంతోపాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఖర్గే అంశంలో న్యాయం చేయాలని సూచించారు. ఇప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తాము మరింత తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించారు.

# సీఎంతో విభేదాల్లేవ్

మొదటి తరువాయి

మీనాక్షినటరాజన్ ద్వారా ఏఐసీసీకి నివేదిక సమర్పించిందని, అధిష్టానం తదుపరి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. శనివారం టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని అడగనని, మంత్రి పదవి కంటే పీసీసీ చీఫ్ పదవే పెద్దదని చెప్పారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించి ఆ పదవి తనకు కావాలని కోరుకునేంత హీనుడిని కాదని తేల్చి చెప్పారు. వాస్తవానికి బీసీలకు మంత్రివర్గంలో సరైన వాటా దక్కలేదన్నారు. సుస్మిత పటేల్‌కు పార్టీ సభ్యత్వం లేదని, తల్లిగా కుమార్తె విమర్శలను కొండా సురేఖ ఖండించాల్సి ఉందని అన్నారు. కొండా సురేఖకు సంబంధించి తనతో పాటు సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయాలను క్రమశిక్షణ కమిటీ తీసుకుందని, అన్ని కోణాల్లో ఆలోచించే క్రమశిక్షణ కమిటీ అధిష్టానానికి నివేదిక సమర్పించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువని, స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పడం ఇక్కడ తప్ప మరేపార్టీలో సాధ్యం కాదన్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలను విమర్శించిన వారిని సైతం మంత్రి వర్గంలో లేదా పార్టీలో మంచి స్థాయిలో గుర్తింపు ఇచ్చినట్టు గుర్తుచేశారు. బీజేపీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షాలను విమర్శించి బట్టగట్టగలరా అని ఆయన ప్రశ్నించారు. పార్టీలో చేరే సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని పార్టీ హామీ ఇచ్చిందని, నిర్ణయం అధిష్టానానిదేనని అన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎన్నికలకు ముందు ప్రకటించిన గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేకపోతున్నామని, ఎన్నికల నాటివి అన్ని హామీలు పూర్తిచేస్తామని మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కొండా సురేఖ ఓఎస్డీగా పనిచేసిన సుమంత్‌ను ఆరేడు నెలల క్రితమే ఉద్యోగం నుంచి ప్రభుత్వం తొలగించిందని గుర్తుచేశారు.

## సంపాదకీయం

# నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు !



నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక పక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఎ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి పక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.

# టీనేజర్లకు ఇదో డేంజర్




సోషల్ మీడియా విడిచిపెట్టరాని వ్యసనంగా మారడంపై గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు, పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే సోషల్ మీడియా సంస్థలు తమ వల్ల కలిగే దుష్ఫలితాలపై జవాబుదారీ వహించడం లేదు. అమెరికా లోని కాలిఫోర్నియా, కొలరాడో, కెంటకీ, న్యూజెర్సీ తదితర రాష్ట్రాల్లో మెటా ప్లాట్‌ఫారమ్‌లపై దాఖలైన కేసులపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. పిల్లలు మొదలు యువత వరకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లను వ్యసనపరంగా మార్చేలా మెటా కంపెనీ ఉద్దేశపూర్వకంగా వాటిని రూపొందించిందా? వీటిని అత్యధికంగా వినియోగిస్తే వినియోగదారులకు హాని తప్పదని తెలిసినా నిర్లక్షం వహించిందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు ఈ కేసుల పరిశీలనలో ఎదురవుతున్నాయి. ఆత్మహత్య చేసుకున్న నలుగురు అమెరికన్ టీనేజర్ల కుటుంబాలు మెటా, టిక్‌టాక్, స్నాప్‌చాట్, యూట్యూబ్‌పై కేసులు వేశారు. వీటి వినియోగం తమ పిల్లల చావుకు దారితీసిందని ఆరోపించారు. ఇంతకు ముందెన్నడూ లేనంతగా ఇప్పుడు సోషల్ మీడియావల్ల అనర్థాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి.ఒక వ్యక్తికి సోషల్ మీడియావల్ల ఎంతవరకు దుష్ఫలితాలు సంభవించాయో తెలుసుకోవడానికి 2026 ఏప్రిల్‌లో యాక్సిస్ ఇంటెలిజెన్స్ 32 దేశాల్లోని మెటా నిర్వహణపై అధ్యయనం నిర్వహించింది. ఒత్తిడి లేదా బాధ నుంచి ఉపశమనం కోసం సోషల్ మీడియాను ఎక్కువ సేపు వినియోగించడం, సోషల్ మీడియా వినియోగించలేనప్పుడు చికాకు కలగడం, చదువు, పని, నిద్ర లేదా సంబంధాలపై ప్రతికూల ప్రభావం, తదితర అంశాలపై ప్రశ్నల ద్వారా అభిప్రాయాలు సేకరించారు. ఈ అధ్యయనంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 5.8 బిలియన్ మంది సోషల్ మీడియాకు బానిసలయ్యారని తేలింది. వీరిలో దాదాపు 24% మంది ‘సమస్యాత్మక వినియోగం’ స్థాయికి చేరుకుంటున్నారని బయటపడింది. అమెరికా టీనేజర్లలో 46 శాతం మంది తాము నిరంతరం ఆన్‌లైన్‌లోనే ఉంటామని వెల్లడించారు. సంవత్సరం పాటు వినియోగించిన తరువాత కుంగుబాటు లక్షణాలు దాపురిస్తున్నాయని జమా నెట్‌వర్క్ ఓపెన్‌లో ప్రచురించిన అధ్యయనం వెల్లడించింది. 2025లో ప్యూరీసెర్చ్ సర్వేలో 48% టీనేజర్లు తమపై సోషల్ మీడియా ప్రభావం ప్రతికూలంగా ఉందన్నారు. 2021లో ఒక విజిల్ బ్లోయర్ మెటా సంస్థలోని అంతర్గత పరిశోధనలను బయటపెట్టిన తరువాత మెటాపై ఇప్పుడు న్యాయ విచారణ ప్రారంభమైంది. అంతులేని స్క్రోలింగ్, స్వయం చాలకంగా వీడియోలు/ కంటెంట్ ప్లే కావడం (ఆటో ప్లే) వంటి ఫీచర్లు ఎక్కువ సేపు ప్లాట్‌ఫారమ్‌లో వినియోగదారులను కట్టిపడేస్తున్నాయి.అయితే ఇక్కడ అసలు ప్రశ్న జవాబుదారీతనం గురించి. సోషల్ మీడియావల్ల కలుగుతున్న దుష్ఫలితాలకు ఆయా టెక్ కంపెనీలు ఎంతవరకు బాధ్యత వహించాలి? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ కంపెనీల చట్టపరమైన బాధ్యత ఇప్పుడు ప్రధాన అంశంగా మారుతోంది. ఆస్ట్రేలియా, ఇండోనేసియా, మలేసియా, బ్రెజిల్ వంటి దేశాలు 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధించాయి. బ్రిటన్, ఫ్రాన్స్, నార్వే, డెన్మార్క్ వంటి దేశాలు కూడా ఇలాంటి చట్టపరమైన చర్యలను తీసుకోవాలని యోచిస్తున్నాయి. ఇందులో వయసు నిర్ధారణ కీలక అంశంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా కనీసం 79 విద్యాసంస్థలు తమ పాఠశాలల్లో స్మార్ట్ ఫోన్ వినియోగంపై ఆంక్షలు విధించాయి. 2017లో దేశంలో బ్లూవేల్ ఛాలెంజ్ అనే ప్రమాదకరమైన ఆన్‌లైన్ ఛాలెంజ్‌గా సంచలనం కలిగించింది. ఇందులో పాల్గొనే వారిని క్రమంగా ప్రమాదకరమైన పనులు, స్వీయహాని వంటి చర్యల వైపు ప్రేరేపిస్తున్నట్టు అప్పట్లో నివేదికలు వచ్చాయి. ముంబై, కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు, తదితర ప్రాంతాల్లో కొంతమంది యువత ఆత్మహత్యలకు పాల్పడడంతో బ్లూవేల్ ఛాలెంజ్ ప్రభావమేనన్న అనుమానాలు రేకెత్తాయి. ముంబైలో 14 ఏళ్ల బాలుడు మరణం బ్లూవేల్ వల్లనే జరిగినట్టు ఆరోపణలు రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కానీ ఆధారాలు దొరకలేదు.

# జన్ జీ బాటలో జన్ అల్ఫా




నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాకు పరిమితమైన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఎటువంటి హడావుడి లేకుండా ప్రారంభించిన నిరసనలు ఇప్పుడు దేశ ప్రజల దృష్టిని ప్రభుత్వ విద్యారంగం వైపు మళ్లిస్తున్నాయి. ముఖ్యంగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ఆందోళనలకు దారితీస్తుంది. ఉన్నత విద్యావ్యవస్థలో సంస్కరణల కోసం ఢిల్లీలో జన్ జెడ్ నిరసనగా ప్రారంభమైన ఈ ఆందోళనలు నేడు జన్ ఆల్ఫా ఉద్యమంగా మారుతున్నాయి. గత మూడు వారాలుగా, పాఠశాల విద్యార్థులు తమ తరగతి గదుల నుండి బయటకు వచ్చి, ప్రభుత్వ కార్యాలయాల వరకు ప్రదర్శనలు నిర్వహించి, పాఠశాల గేట్లకు తాళాలు వేసి, రోడ్లపై కూర్చొని అధికారుల నుండి సమాధానాలు కోరుతున్నారు. వారి డిమాండ్లు చాలా ప్రాథమికమైనవి. వారికి ఉపాధ్యాయులు, తరగతి గదులలో ఫ్యాన్లు, లైట్లు, డెస్కులు వంటి ప్రాథమిక సౌకర్యాలు, తినదగిన ఆహారం, శుభ్రమైన తాగునీరు, పనిచేసే మరుగుదొడ్లు కావాలి. కొన్ని సందర్భాల్లో పాఠశాలకు సరైన రహదారిని కూడా వారు కోరుతున్నారు.ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో నిరసనలు జరిగినట్లు నివేదికలు వచ్చాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత, సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, స్వాతంత్ర్య దినోత్సవం రోజున మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో ఉన్న తన గ్రామం నుండి ‘స్కూల్ ఠీక్ కరో’ (పాఠశాల సరిదిద్దుకోండి) ప్రచారాన్ని ప్రారంభించారు. ఇటీవలి జన్ జెడ్ నిరసనల స్ఫూర్తితో మొదలైనట్లు కనిపించిన ఈ నిరసనలు, ఇప్పుడు మరో భారీ ప్రజా సమీకరణకు నాంది పలికేలా కనిపిస్తున్నాయి. ఈసారి జన్ ఆల్ఫా దీనికి ముందుండి నడిపిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని కిషన్‌పూర్‌లో ఉన్న సర్వోదయ ఇంటర్ కాలేజీ విద్యార్థులు జాతీయ దృష్టిని ఆకర్షించిన వారిలో మొదటివారు. జూన్ -జులైలో జరిగిన జంతర్ మంతర్ ఆందోళనలో పాల్గొన్న నలుగురు 12వ తరగతి విద్యార్థులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లి పాఠశాలలో ఈ నిరసనను నిర్వహించారు. వారిలో ఒకడైన అంకుర్ సోంకర్, ఢిల్లీ నిరసన నుండి తాను ఒక సాధారణ పాఠాన్ని నేర్చుకున్నానని చెప్పాడు: మీ హక్కుల కోసం పోరాడండి.మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో, ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం లేదా 6-10 కిలోమీటర్ల దూరంలోకి తరలించే ప్రణాళికలకు వ్యతిరేకంగా వందలాది మంది పాఠశాల బాలికలు నిరసన తెలిపారు. అక్కడ సమస్య కేవలం మౌలిక సదుపాయాలకు మించిపోయింది. ముఖ్యంగా ఒక బాలికకు, ఆమె అసలు పాఠశాలకు వెళ్తుందా లేదా అనేది దూరంపైనే ఆధారపడి ఉంటుంది. కాబట్టి, ఈ నిరసనలు కేవలం పాడైన ఫ్యాన్లు, మురికి టాయిలెట్లు లేదా భౌతిక మౌలిక సదుపాయాల కొరతకు సంబంధించినవి మాత్రమే కాదు. ఉద్యమానికి ఊపు రావడం నిస్సందేహంగా ఒక కారణమే అయినా, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, స్థానిక ప్రతినిధులు వంటి సంప్రదాయ పరిష్కారాలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే మార్గాలు ఫలించలేదనే భావనల కారణంగా కూడా ఈ నిరసనలు చెలరేగుతున్నాయి. ఆన్‌లైన్‌లో కనిపించడం అనేది నిజ ప్రపంచంలో ఒక శక్తి స్వరూపమని జన్ జెడ్ నిరసనలు నిరూపించాయి. ఈ డిజిటల్ తరం వారు తమ దైనందిన జీవితాన్ని, తమ సహజ జీవన విధానాన్ని ఒక ఆయుధంగా మార్చుకున్నారు.ఇప్పుడు వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడటానికి ఒక నమూనా అందుబాటులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ఇప్పుడు ప్రజలను సమీకరించే సాధనంగా మారాయి. స్మార్ట్‌ఫోన్‌లలో తీసిన పోస్టర్లు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. చిన్న వీడియోలు స్థానిక సమస్యలను ప్రజా సమస్యలుగా మారుస్తున్నాయి. ఒక వ్యాఖ్యాత అన్నట్లుగా, ఇప్పుడు ‘జన్ ఆల్ఫా’ తమ స్క్రీన్‌ల నుండి వీధుల్లోకి అడుగుపెడుతోంది. స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి ఒక్కరూ ఇన్‌స్టాగ్రామ్ ఉపయోగించాలని ఆదేశించాల్సి వచ్చింది. అంతేకాదు, మంత్రులు గత రెండున్నర నెలల్లో సోషల్ మీడియాలో ఏ విధంగా వ్యవహరించారో తెలిపే నివేదికలను ఒకొక్కరికి అందజేశారు. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఉన్న రాంపుర కన్యాపుర గ్రామంలో ప్రభుత్వ స్కూల్‌ను సిజెపి బృందం పరిశీలించేందుకు ఇటీవల వెళ్లగా వారిపై దాడి జరగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆ స్కూల్‌ను సందర్శించడానికి సిజెపి వెళ్తుంటే దాడి చేయడం ఏంటని తీవ్ర విమర్శలు రావడంతో అధికారులు విద్యార్థులను శనివారం వేరే బిల్డింగ్‌లోకి తరలించారు. మరోవైపు రాజస్థాన్‌లో ఏకంగా 611 ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు లేవని ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చింది. రాజస్థాన్‌లో 2,047 పాఠశాలల్లో ఇప్పటికీ సరైన మరుగుదొడ్లు లేవని ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో వెల్లడైనది. సిజెపి పర్యటనలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల రిపేర్లకు రూ. 550 కోట్లు కేటాయిస్తున్నామని, రూ.450 కోట్లు కొత్త బిల్డింగుల కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపింది. భారతదేశంలో దశాబ్దాలుగా సార్వత్రిక పాఠశాల విద్య, విద్యా హక్కు, ప్రతి బిడ్డకు సమాన అవకాశం వంటి విషయాలపై కేవలం మాటలకే పరిమితమైంది. అయినప్పటికీ, అణగారిన పిల్లల అనుభవం తీవ్రమైన అసమానతలతో కూడుకుని ఉంది. తన హక్కుగా దక్కాల్సిన దానిని పొందడానికి ఒక చిన్నారి కలెక్టరేట్ వరకు 5 కిలోమీటర్లు ఎందుకు నడవాలి? పాఠశాల చాలా దూరంలో ఉందని ఆమె ఎందుకు చదువు మానేయాలి? ఇది ప్రాథమిక సౌకర్యాల కన్నా కూడా అత్యంత ప్రాథమికమైన సమస్య: ఇది ‘విద్యను పొందే అవకాశం’, పేదరికం నుండి బయటపడే మార్గం, సామాజిక ఉన్నతికి ఒక అవకాశం వంటి వాటికి సంబంధించినది. ఇటువంటి మౌలిక ప్రశ్నలను ఇప్పుడు బాలబాలికలు లేవనెత్తడం నిజంగా దేశంలోని ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు సిగ్గుతో తలవంచుకోవాల్సిన అంశాలు. లూటియన్స్ ఢిల్లీలోని కేంద్ర మంత్రుల నివాసాల వార్షిక నిర్వహణ వ్యయం 2014- 15లో రూ. 27 కోట్లు ఉండగా, 2025 -26 నాటికి అది రికార్డు స్థాయిలో రూ. 92 కోట్లకు పెరిగిందన్న నివేదిక నేపథ్యంలో ‘మీ విలాసవంతమైన నివాసాలను బాగు చేయడం మానేసి, పాఠశాలలను బాగు చేయండి’ అని సిజెపి పేర్కొంది. రూ. 92 కోట్లతో 10 ‘ప్రపంచ స్థాయి’ ప్రభుత్వ పాఠశాలలను నిర్మించడం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా తెలిపింది. ప్రైవేట్ పాఠశాలలకు పంపే స్తోమత లేని కుటుంబాల పిల్లలకు విద్యాహక్కును వాస్తవ రూపంలో అందించడంలో, ఆ ప్రాప్యతను కల్పించడంలో ప్రభుత్వ పాఠశాలల పాత్రను మరింత లోతుగా పరిశీలించేలా జన్ ఆల్ఫా నిరసనలు ప్రేరేపిస్తాయని ఆశిద్దాం. గత దశాబ్ద కాలంలో, తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలలను మూసివేయడాన్ని సూచించే అధికారిక పదం ‘హేతుబద్ధీకరణ’. ఈ పేరుతో 90,000కు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం లేదా విలీనం చేశారు. జుఒబఝ్‌అశీఅ నీతి ఆయోగ్ పవర్ పాయింట్‌లో, ఈ ‘హేతుబద్ధీకరణ’ అంటే వనరులను సమీకరించడం, ‘ఎకానమీస్ ఆఫ్ స్కేల్’ సాధించడం అని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో దీని అర్థం ఏమిటంటే, గిరిజన కుగ్రామంలో లేదా ఒబిసి గ్రామంలోని ఒక పిల్లవాడు ఇప్పుడు ప్రతిరోజూ అదనంగా 4 లేదా 5 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ పల్లెటూరి అమ్మాయికి ప్రోత్సాహకరమైన తల్లిదండ్రులు ఉన్నప్పటికీ, పాఠశాలకు చేరుకోవడానికి ఒకవైపు 5 కిలోమీటర్లు నడవడానికి వారు అనుమతించే అవకాశాలు ఎంత? అందుకే, ప్రాథమిక స్థాయిలో చేరికలు తగ్గడం, సంవత్సరాల తర్వాత మొదటిసారిగా స్థూల నమోదు నిష్పత్తులు పడిపోవడంలో ఆశ్చర్యం ఏముంది? సర్వ శిక్షా అభియాన్, విద్యా హక్కు చట్టం చేసిన మేలు ఏమాత్రం సరిపోవడం లేదు. కానీ రాజ్యాంగ హక్కుగా ప్రతి బిడ్డకు నడిచి వెళ్ళే దూరంలో ఒక పాఠశాల ఉండటం ఒక మంచి ఆరంభం. ఈ నష్టాన్ని పూడ్చుడానికి, పాఠశాలల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసే నిరసనల కన్నా ఎక్కువే అవసరం. విద్య పొందే అవకాశం ఒక హామీగా కాకుండా ఒక ప్రత్యేక హక్కుగా మారినప్పుడు, అసలు వాస్తవం ఏమిటో తెలుస్తుంది.

## కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్‌పై బిఆర్ఎస్ కో-ఆర్డినేటర్ రెడ్డి సతీష్ ఆరోరా తీవ్ర ధ్వజం



**వర్త సంధ్య కూకట్‌పల్లి :** కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్ వంటి వలస నాయకులు ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా కూకట్‌పల్లి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కో–ఆర్డినేటర్ రెడ్డి సతీష్ ఆరోరా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత 30 ఏళ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తూ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిచిన మాధవరం కృష్ణారావుపై కబ్జాదారుడంటూ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని, గత ఎన్నికల్లో ప్రజా తీర్పుతోనే ప్రతిపక్షాల నోళ్లు మూతపడ్డాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి, బండి రమేష్‌కూ ప్రభుత్వ భూములేవో, ప్రైవేట్ భూములేవో కనీస అవగాహన లేదని విమర్శించారు. ప్రజలను బెదిరించి సొమ్ము చేసుకునేందుకే ప్రైవేట్ భూములను సైతం 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హైదర్ నగర్ సర్వే నంబర్లు 145, 163లతో పాటు హస్మత్‌పేట సర్వే నంబర్ 1 భూములు జూ–14 ప్రకారం 'పైగా ప్రాపర్టీస్'గా ఉన్నాయని స్పష్టం చేశారు. నాటి నుంచి నేటి వరకు హైకోర్టు, సుప్రీంకోర్టులు ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఇవ్వడంతోనే ప్రజలు ఆ స్థలాలను కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఇందులో రాజకీయ నాయకుల పాత్ర ఏముందో విచారణ జరపాలని సవాల్ విసిరారు. 1958 నుంచి నేటి వరకు ఇక్కడి భూముల్లో ఎవరెవరు కబ్జాలకు పాల్పడ్డారో మీ ప్రభుత్వమే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఒకవైపు 22ఏ లోని భూములకు న్యాయం చేస్తామంటూనే, మరోవైపు అవే భూములను కబ్జా భూములని అనడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. హస్మత్‌పేట సర్వే నంబర్ 1 భూముల్లో 20 ఏళ్ల క్రితమే అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే అపార్ట్‌మెంట్లు నిర్మించిన విషయం కూకట్‌పల్లి ప్రజలందరికీ తెలుసని, ధైర్యం ఉంటే దానిపై విచారణ జరపాలని పేర్కొన్నారు. అల్లాపూర్, గోపాల్ నగర్‌లలో కాంగ్రెస్ నాయకులే కబ్జాలకు పాల్పడ్డారని, వారి అవినీతి వల్లే ఇటీవల ముగ్గురిని పార్టీ నుండి తొలగించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.


రాజకీయ భవిష్యత్తు కోసం పలు పార్టీలు మారిన బండి రమేష్‌కు తమ హ్యాట్రిక్ ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదని మండిపడ్డారు. అధికారం కోసం రేపు ఏ పార్టీలోకి మారతారో తెలియని ఇలాంటి వలస నాయకుల పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని రెడ్డి సతీష్ ఆరోరా హెచ్చరించారు.

## రేషన్ కార్డు.. సంక్షేమ పథకాలకు కీలక పత్రం

**36,348 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

**అర్హులందరికీ కార్డులు అందేలా చర్యలు: ఎమ్మెల్యే శ్రీగణేశ్**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఆగస్టు 29.** బోయిన్ పల్లిలోని యాదవ భవన్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీ గణేష్ 36,348 స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో పదేళ్ల పాటు అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించలేదని, ఉన్న రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించలేదని, పదేళ్లలో రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను అందించినట్లు తెలిపారు. అనివార్య కారణాల వలన రేషన్ కార్డు పొందని వారు, పేర్ల నమోదు, ఈ కేవైసీ తదితర అంశాలపై కంటోన్మెంట్ వాణీ మాదిరిగా అన్ని శాఖల అధికారులతో త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, లబ్ధిదారులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆహార భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలంటే అర్హత కలిగిన కుటుంబాలకు రేషన్ కార్డు ఉండటం ఎంతో అవసరమన్నారు. గత పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు వారి ఇంటి వద్దకే చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. రేషన్ కార్డు ద్వారా పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు రేషన్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు చేరువ అవుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే శ్రీ గణేష్ లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలి: ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 29 (వార్త సంధ్య )** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్క కార్యకర్త సమష్టిగా కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఇమ్మడి తిరుపతిరావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నాయకత్వంలో సింగరేణి మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోతు రామ్మూర్తి, గూగులోతు రవి నాయక్, దుగ్గినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో గందరగోళంగా 'ఇందిరమ్మ ఇండ్ల' లాటరీ






**- నిబంధనలు గాలికి.. లబ్ధిదారుల నిరసన!**

వర్త సంధ్య కూకట్‌పల్లి :
రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లాటరీ కార్యక్రమం అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా తీవ్ర గందరగోళానికి దారితీసింది. శనివారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ డ్రా కార్యక్రమంలో అధికారులు నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ డివిజన్ పరిధిలో మొత్తం 9,326 దరఖాస్తులు రాగా, అధికారులు 5,976 మందిని అర్హులుగా గుర్తించారు. 480 ఇండ్ల కేటాయింపు కోసం హౌసింగ్ బోర్డ్ లైజనింగ్, భూసేకరణ అధికారి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ బాబు, తహసిల్దార్ అశోక్ కుమార్ సమక్షంలో ఈ లాటరీ నిర్వహించారు. హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ గౌతమ్ కూడా ఈ కార్యక్రమాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించారు.

నిబంధనలు తుంగలో.. వెక్కిరింతగా లాటరీ!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళలకు 30 శాతం (125 ఇండ్లు) కేటాయించాల్సి ఉండగా, అధికారులు ఆ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించకుండానే లాటరీ పూర్తి చేయడం గమనార్హం. అలాగే కేటగిరీల వారీగా చిట్టీలను విభజించి డ్రా తీయాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యం వహించారు.

– మిశ్రమ చిట్టీలు -- నిలిచిన డ్రా: ఎస్సీ కేటగిరీ లాటరీ తీస్తున్న సమయంలో ఓబీసీలకు చెందిన చిట్టీలు బయటపడటంతో లబ్ధిదారులు వేదిక వద్దకు వెళ్లి అధికారులను నిలదీశారు. అధికారులు చేపట్టిన రీ–వెరిఫికేషన్‌లో ఎస్సీ కోటాలో 35 ఓబీసీ చిట్టీలు వచ్చినట్లు తేలింది. దీంతో డ్రా సుమారు గంటన్నర పాటు నిలిచిపోయింది.

– ఎస్సీ కేటగిరీపై వివక్ష: తొలగించిన 35 చిట్టీలకు సంబంధించిన ఎస్సీ లబ్ధిదారుల రసీదులు ఏమయ్యాయని నిలదీసినా అధికారులు పట్టించుకోలేదు. అంతేకాకుండా 67 ఇండ్లకు లాటరీ తీయాల్సి ఉండగా 65 మాత్రమే తీసి, 67 పూర్తి చేసినట్లు ప్రకటించారు. మిగిలిన రెండు చిట్టీలు తీయాలని కోరినా లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి స్పందించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమైంది.

– కేటగిరీల విభజనలో లోపాలు: బీసీ, ఓబీసీలకు వేర్వేరుగా డ్రా నిర్వహించాల్సి ఉన్నప్పటికీ మొత్తం కలిపి ఒకే కేటగిరీగా తీశారు. అవుట్‌సోర్సింగ్ కోటాలో 48 ఇండ్లు ఉండగా కేవలం 15 మందినే అర్హులుగా చూపి, మిగిలిన దరఖాస్తుదారులను కులాల కేటగిరీలో కలిపేశారు. దీనిపై ప్రశ్నించిన బాధితులకు "ఇది పైలట్ ప్రాజెక్ట్ మాత్రమే, తర్వాతి విడతలో చూద్దాం" అని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

– వెయిటింగ్ లిస్ట్‌పై అస్పష్టత: 120 మందితో కూడిన వెయిటింగ్ లిస్ట్‌ను కేటగిరీల వారీగా కాకుండా ఒకే జాబితాగా రూపొందించారు. దీనివల్ల ఏదైనా కేటగిరీ ఇల్లు రద్దయితే ఆ ఇల్లు ఎవరికి దక్కుతుందో తెలియని అయోమయం నెలకొంది.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు స్వీకరించాలనే నిబంధనను కూడా అధికారులు పాటించలేదని, అర్హుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రా సందర్భంగా జరిగిన అనేక తప్పిదాలు, అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏఐ మాయలో పడొద్దు..
# జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలి





**-తప్పుడు సమాచారాన్ని ఛేదించేందుకు అత్యాధునిక ఫ్యాక్ట్‌చెకింగ్ టూల్స్ వినియోగించాలి**

**-ఏఐ సహాయకుడే తప్ప.. మానవ విచక్షణకు ప్రత్యామ్నాయం కాదు: సీనియర్ జర్నలిస్టు ఉడుముల సుధాకర్ రెడ్డి**

కృత్రిమ మేధస్సు (ఏఐ) విస్తరిస్తున్న కొద్దీ తప్పుడు, వక్రీకరించిన సమాచార వ్యాప్తి కూడా పెరుగుతోందని, ఈ సవాలును ఎదుర్కొనేందుకు జర్నలిస్టులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫ్యాక్ట్‌చెకింగ్ సాధనాలతో నిరంతరం అప్‌డేట్ కావాలని సీనియర్ జర్నలిస్టు, టెక్నాలజీ నిపుణుడు ఉడుముల సుధాకర్ రెడ్డి సూచించారు.

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఆగస్టు 29.** :సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం గూగుల్, డాటా లీడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ ప్రొవెనెన్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐ ద్వారా రూపొందించిన లేదా మార్చిన ఫొటోలు, వీడియోలు, ఆడియోలు, సమాచారాన్ని గుర్తించి ధృవీకరించే విధానాలను జర్నలిస్టులకు వివరించారు. "ఏఐని వృత్తిపరమైన సహాయకుడిగా ఉపయోగించాలి.. కానీ మానవ విచక్షణకు ప్రత్యామ్నాయంగా భావించకూడదు" అని సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలు కొన్నిసార్లు వాస్తవం లేని సమాచారాన్ని సృష్టించే అవకాశం ఉందని, వీటినే 'హాల్యూసినేషన్స్' అంటారని తెలిపారు. ఏఐ ఇచ్చిన సమాచారాన్ని యథాతథంగా నమ్మి వార్తలు రాయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యమైన ప్రతి అంశాన్ని స్వతంత్రంగా ధృవీకరించడంతో పాటు, అవసరమైతే పలు ఏఐ మోడళ్లు, విశ్వసనీయ మానవ వనరుల ద్వారా క్రాస్‌చెక్ చేయాలని సూచించారు.

డీప్‌ఫేక్‌లకు టెక్నాలజీతోనే చెక్

గూగుల్ అభివృద్ధి చేసిన వంటి టూల్స్ ద్వారా ఏఐ కంటెంట్‌ను పరిశీలించే విధానాలను ఆయన వివరించారు. ద్వారా గూగుల్ ఏఐ సిస్టమ్స్‌తో రూపొందిన చిత్రాలు, వీడియోలు, ఆడియోల్లోని కనిపించని డిజిటల్ వాటర్‌మార్క్‌లను గుర్తించే అవకాశం ఉందన్నారు.

అయితే ఏఐ కంటెంట్ అన్ని ప్లాట్‌ఫామ్‌ల నుంచీ రావచ్చని, అందువల్ల వంటి ఇతర సాధనాలను కూడా అవసరానికి అనుగుణంగా ఉపయోగించాలని సూచించారు.

సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలించడం ద్వారా బాట్స్, ఆటోమేటెడ్ అకౌంట్లను గుర్తించవచ్చని తెలిపారు. అనుమానాస్పద ఫొటోల మూలాన్ని తెలుసుకోవడంలో ఫేషియల్ సెర్చ్ టూల్స్ ఉపయోగపడతాయని చెప్పారు.

ఒక్క ఫొటోతో కథనం నమ్మొద్దు

ఒక ఫొటో లేదా వీడియో నిజంగా పేర్కొన్న ప్రాంతానికి, సందర్భానికి సంబంధించినదేనా తెలుసుకునేందుకు వంటి జియోలొకేషన్ సాధనాలను ఉపయోగించవచ్చని సుధాకర్ రెడ్డి తెలిపారు. ప్రదేశంలోని భౌగోళిక పరిస్థితులు, భవనాలు, రహదారులు, పాత చిత్రాలను పోల్చడం ద్వారా కంటెంట్ నిజస్వరూపాన్ని నిర్ధారించవచ్చన్నారు.

'ప్రాంప్ట్' సరిగ్గా ఇస్తేనే మెరుగైన ఫలితం.

ఏఐని సమర్థవంతంగా వినియోగించేందుకు జర్నలిస్టులు పై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఏఐకి స్పష్టమైన పాత్ర, అవసరమైన నేపథ్యం, కావాల్సిన ఫార్మాట్‌ను నిర్దేశిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. అదే సమయంలో ఏఐ ఏం చేయాలి, ఏం చేయకూడదు అనే విషయాలను కూడా స్పష్టంగా చెప్పాలని సూచించారు.

ఏఐ తన శిక్షణ డేటాలోని పక్షపాతాలను, మూస ధోరణులను కూడా పునరుత్పత్తి చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ఏఐ రూపొందించిన సమాచారాన్ని ఎలాంటి ధృవీకరణ లేకుండా ప్రచురించకూడదన్నారు.

ఇప్పటివరకు జర్నలిస్టులు, విద్యార్థులు సహా 10,000 మందికి పైగా వ్యక్తులకు ఫ్యాక్ట్‌చెకింగ్, ఏఐ బాధ్యతాయుత వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు సుధాకర్ రెడ్డి తెలిపారు.

మీడియా సంస్థల సంపాదకీయ ప్రమాణాలను కాపాడే తుది బాధ్యత జర్నలిస్టులదేనని పేర్కొన్న ఆయన.. నిరంతర అభ్యాసం, ఫ్యాక్ట్‌చెకింగ్ నైపుణ్యాలు, స్వీయ కేస్‌స్టడీల ద్వారా డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, వక్రీకరించిన కంటెంట్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు.

కార్యక్రమం అనంతరం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల,ఉపాధ్యక్షులు ఏ. రాజేష్ , అత్తలూరి అరుణ, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ తదితర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వనం నాగరాజు, దయ్యాల అశోక్, కస్తూరి శ్రీనివాసులు సుధాకర్ రెడ్డిని సన్మానించి అభినందించారు.

## కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి



**అనుముల, ఆగస్టు 29 (వార్త సంధ్య )** అనుముల మండలం బ్లాక్ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ షేక్ ఖాసీం గారి తండ్రి ఇటీవల మృతి చెందారు . ఈ విషయం తెలుసుకున్న సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ,11 వ రోజు దిన కర్మలకూ హాజరై చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్స్, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ తదితరులు హాజరయ్యారు.

# జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పనులు పకడ్బందీగా చేపట్టాలి

**-మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**జైపూర్,ఆగస్టు 29 (వార్త సంధ్య**
ప్రభుత్వం చేపట్టిన జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పనులు పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని జైపూర్ మండలం కుందారం గ్రామ పంచాయతీలో జలసిరి కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న పంట కుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ భూగర్భ నీటిమట్టాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పంట కుంట పనులలో పాటించాల్సిన జాగ్రత్తలు, పనుల పురోగతి అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని వివిధ రిజిస్టర్లు, రికార్డులతో పాటు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించి, ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన వ్యక్తులు సంబంధిత స్థాయి అధికారులను సంప్రదించి అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఎ.పి.ఓ., పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, టి.ఎ., క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి క్వార్టర్లలో షార్ట్‌సర్క్యూట్
# ప్రమాదాలు అరికట్టాలి-సీఐటీయూ

**బాధిత క్వార్టర్‌కు తక్షణమే మరమ్మతులు ప్రారంభించిన యాజమాన్యానికి ధన్యవాదాలు**





**రామగిరి,ఆగస్టు 29 (వార్త సంధ్య**
ఆర్జీ-2 ఏరియా జీడీకే 8వ ఇంక్లైన్ కాలనీలోని టీ2-1255 క్వార్టర్‌లో శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లోని ఫ్రిడ్జ్,గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధమై తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. అదృష్టవశాత్తూ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాలనీలోని అనేక క్వార్టర్లలో సరైన ఎర్తింగ్ లేకపోవడం, ఎం సి బి,ఆర్ సి సి బి వంటి రక్షణ వ్యవస్థలు అందుబాటులో లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలకు అవకాశం ఉందని నాయకులు పేర్కొన్నారు. కాలనీలోని అన్ని క్వార్టర్లలో ఎలక్ట్రికల్ వైరింగ్,ఎర్తింగ్, ఎం సి బి,ఆర్ సి సి బి ట్రిప్పింగ్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి,లోపాలను వెంటనే సరిచేయాలని సీఐటీయూ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు ప్రమాదం జరిగిన వెంటనే మైన్ రెస్క్యూ స్టేషన్‌కు సంబంధించిన బృందం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా అడ్డుకోగలిగారు. ఈ విషయాన్ని ఉదయమే సీఐటీయూ నాయకత్వం జనరల్ మేనేజర్,డీజీఎం (సివిల్/పర్సనల్) అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి,టెండర్ల పేరుతో ఆలస్యం చేయకుండా ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో అదే రోజున బాధిత క్వార్టర్ మరమ్మతు పనులను ప్రారంభించారు. కార్మిక కుటుంబ సమస్యపై తక్షణమే స్పందించి మరమ్మతులు ప్రారంభించిన జనరల్ మేనేజర్,డీజీఎం మరియు సంబంధిత సివిల్, ఎలక్ట్రికల్ అధికారులకు సీఐటీయూ,కాలనీవాసుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్,వైస్ ప్రెసిడెంట్ సోమరాపు వెంకన్న, నాయకులు శివకుమార్, శ్రావణ్, సుమన్,మల్లేశం,నరేష్, తిరుపతితో పాటు స్థానిక కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా మహిళా పొదుపు సమితిపై
# నామని హరికృష్ణ చేసిన ఆరోపణలు నిరాదారం

**- మహిళ సంఘంలో తీసుకున్న అప్పు చెల్లించమంటే సంస్థపై విమర్శలు**

**- మదర్ థెరిస్సా మహిళా పొదుపు సమితి అభివృద్ధిని చూసి ఓర్వలేక మతిస్థిమితం లేని మాటలు మాట్లాడిన హరీష్**

**- నామని హరీ కృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన లోడి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు**



**మంథని, ఆగస్టు 29 (వార్త సంధ్య**
మదర్ థెరిస్సా పొదుపు సమితిపై నామని హరి కృష్ణ చేసిన నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని సమితి లోడీ సంస్థ మంథని డివిజన్ కోఆర్డినేటర్ మేకల మల్లేశం తెలిపారు. శనివారం మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా చేయూత అందించాలనే ఉద్దేశంతో 2001 నవంబర్ 1న సంస్థను స్థాపించామన్నారు. అప్పటి నుంచి సంస్థ దినాభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతోందని లోడి సంస్థ ప్రతినిధులు తెలిపారు. లోడీ సంస్థ పై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ పత్రికల ద్వారా ప్రచారం చేయడం తమను తీవ్రంగా ఆవేదనకు గురి చేసిందన్నారు. సమితికి సంబంధించిన లెక్కలు,వాస్తవాలను మీడియా ముందు అందుబాటులో ఉంచామని వారు పేర్కొన్నారు. లోడి స్వచ్ఛంద సమితి అధ్యక్షురాలు మాదేశి పద్మ మాట్లాడుతూ 2001లో ప్రారంభమైన సమితి 26 సంవత్సరాలుగా కొనసాగుతోందని తెలిపారు. సంస్థకు సంబంధించిన అన్ని లెక్కలు, వివరాలు తమ వద్ద ఉన్నాయని వాటిని మీడియా ముందు ప్రవేశపెట్టామని చెప్పారు. నిరాధార ఆరోపణలతో సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తూ కథనాలు రాయడం సరికాదన్నారు. సమాజంలో ప్రజలను మేల్కొల్పే వార్తలు రాయడం విలేకరి వృత్తిలో ప్రధాన లక్షణమని, వారు రాసే వార్తలు ప్రజలను ప్రభావితం చేస్తాయని ఎంతో కొంత అవగాహనతో వార్తల ప్రతిబింబించేలా వార్తలు రాయాలన్నారు. కొంత మంది విలేకరుల అవగాహన రాహిత్య వార్తలుతో పత్రికా వృత్తికే కళంకం వచ్చే దుస్థితి ప్రస్తుత కొన్ని సంఘటనలను చూస్తే అర్థమవుతుందన్నారు. సమితి కోశాధికారి నామని సుగుణ మాట్లాడుతూ సమితి అభివృద్ధి చెందుతుండటాన్ని ఓర్వలేకనే నామని హరికృష్ణ తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రూపాయి నుంచి ప్రారంభమైన లోడి సంస్థ ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. నోబెల్ బహుమతి గ్రహీత మదర్ తెరిసా ఆశయాలను, మహిళల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.

సమితిపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై సంబంధిత శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సమితి సభ్యులు కోరారు. సంస్థ వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికే ఈ విలేకరుల సమావేశం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సమితి డైరెక్టర్లు ఎలగందుల సరిత, పుల్లె లక్ష్మి, పుల్లె రాజేశ్వరి, తాత యాదమ్మ, ముప్పిడి మల్లేశ్వరి, ఎర్ర రాజేశ్వరి, మైదం శారద తదితరులు పాల్గొన్నారు.

# 9వ వార్డ్ లో 'సర్' నోటీసు ప్రక్రియ

**9వ వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్**



**ఆమనగల్లు, ఆగస్టు 29 (వార్త సంధ్య**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి తొమ్మిదవ వార్డులో శనివారం 'సర్'నోటీసు ప్రక్రియ నిర్వహించారు. 9వ వార్డులోని శ్రీకాంత్ నగర్ కాలనీ లో నోటీసులు వచ్చిన వారికి అందిస్తూ, సరైన సమాచారం లేని వారికి మున్సిపల్ సిబ్బందితో కలిసి కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ ఇంటింటికి తిరుగుతూ నోటీసులను అందించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ లు, మున్సిపల్ సిబ్బంది,కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డ్స్-26 ప్రదానం






**హైదరాబాద్, ఆగస్టు 29 (వార్త సంధ్య**
జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026ను ప్రొఫెసర్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి హాజరై అందజేశారు. ముందుగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జస్టిస్ బి.చంద్రకుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొ.ఇటికల పురుషోత్తం ప్రసంగించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.సాయి బాబా, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.కె.దీప్లా పాల్గొని అవార్డు గ్రహీతలు ప్రొ.బి.సురేష్ కుమార్, డా.కె.అనిత, డా.సి.సందీప్ రెడ్డి, డా.బట్టు వెంకన్న, డా.బి.ఆర్. నేత, డా.పుంజాల సుప్రియ, డా.ఏ.సిద్ధార్థ, డా.ఆర్.మురళి, మేజర్ డి.జయసుధ, మేజర్ కె.ఏ.శివప్రసాద్, పొటెల్ శ్రీనివాస్ యాదవ్ లను సత్కరించారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాధుల మధుసూదన్, జంట నగరాల గుజరాతీ బ్రహ్మ సమాజ్ అధ్యక్షుడు తరుణ్ కుమార్ మేత, కార్యదర్శి డా.మొహమ్మద్ అక్తర్ అలీ, చీఫ్ కోఆర్డినేటర్ డా.రవితేజ, కోఆర్డినేటర్లు జి.వేణుగోపాల్, కె.రవీందర్, సూర్య పాల్గొన్నారు.

# విశ్వశాంతిలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**రాయికల్ ఆగస్టు 29 (వార్త సంధ్య**
పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ.. మాతృభాషా వికాసానికి, ప్రజా భాషా చైతన్యానికి మూలస్తంభంగా నిలిచిన వ్యక్తి గిడుగు వెంకట రామమూర్తి అని అన్నారు. ఆగష్టు 29 గిడుగు జయంతిని తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఆయన వేసిన బాటలు, సవర గిరిజనుల విద్యాభివృద్ధికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. అనంతరం గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను పరామర్శించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



**హైదరాబాద్, ఆగస్టు 29 (వార్త సంధ్య**
తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య శనివారం లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆరోగ్య పరిస్థితిని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ ఆరోగ్యం, వైద్య చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మల్క కొమరయ్య మాట్లాడుతూ, " గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆ భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ వారికి ఉండాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా కొనసాగాలని ప్రార్థిస్తున్నాను" అని తెలిపారు. గవర్నర్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని రాష్ట్ర ప్రజలకు మరింత సేవలందించాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆకాంక్షించారు.

# నూతన గృహప్రవేశంలో పాల్గొన్న మిత్రులు



**రామగిరి,ఆగస్టు 29 (వార్త సంధ్య**
రామగిరి మండలం సెంటనరి కాలనీకి చెందిన దోమ్మటి లావణ్య రవీందర్ దంపతులు పెద్దపెల్లిలో నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నూతన గృహాన్ని సందర్శించిన మిత్రులు దోమ్మటి లావణ్య రవీందర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెంటనరి కాలనీకి చెందిన పురగిరి క్షత్రియ పెరిక సంఘం అధ్యక్షులు ఉగ్గే కుమార్,చిందం కిరణ్,కందుల సదయ్య,కొట్టే భీమన్న,గుండె రాజేందర్,మార్తా,సతీష్ మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com


# 97 ఏళ్ల బామ్మ.. ఓ యోధురాలు



**కాట్మాండు  ఆగస్టు 29 (వార్త సంధ్య**
నేపాల్ వరదల్లో.. బురద నుంచి ఓ బామ్మను రక్షించిన ఫోటోలు వైరల్ అయిన విషయం తెలిసిందే. బురదమయం అయిన ఆ బామ్మను జేసీబీ మెషీన్‌లో తీసుకెళ్లిన దశ్యాలను యావత్ ప్రపంచం వీక్షించింది. అయితే ఆమె ఎవరో తెలిసిపోయింది. ఆ బామ్మ వయసు 97 ఏళ్లు. ఆమె పేరు గునా మాయా బోహరా. నేపాల్ జల ప్రళయానికి ఆ వృద్ధురాలు సజీవ సాక్ష్యం. బుధవారం నాటి విలయంలో వందల సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. కానీ ఈ 97 ఏళ్ల బామ్మ ఆయుష్షు మాత్రం ఇంకా ఉంది. ఆమెతో ఉన్న వాళ్లు కొందరు మరణించారు. కానీ బురదలో ఇరుక్కున్న బామ్మ మాత్రం సజీవంగా బయటకు వచ్చింది.బామ్మను కాపాడేందుకు భారీ ఆపరేషన్ చేపట్టారు. గునా మాయా బోహరా మనవడు దీపక్ మోహరా మీడియాతో మాట్టాడాడు. యుద్ధం నుంచి విజేతగా తిరిగివచ్చిన ఓ యోధురాలిగా తన బామ్మ ఉన్నట్లు పేర్కొన్నాడు. ఓ అంతర్జాతీయ మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఆ బామ్మను రక్షించుకునేందుకు దీపక్ బోహరా కాట్మాండు నుంచి త్రిశూలీ ప్రాంతానికి చేరుకున్నాడు. బురదలో చిక్కుకున్న ఆ వృద్ధురాలిని రక్షించేందుకు కనీసం 4 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాల్సి వచ్చిందని అతను చెప్పాడు.

# ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద ఆయిల్ డీల్..

**వెనిజువెలాతో ఒప్పందంపై ట్రంప్ ప్రకటన**



**న్యూయార్క్  ఆగస్టు 29 (వార్త సంధ్య**
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్  కీలక ప్రకటన చేశారు. ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద ఇంధన ఒప్పందం కుదిరినట్లు ఆయన పేర్కొన్నారు. వెనిజువెలా దేశంతో ఆ డీల్ కుదిరినట్లు వెల్లడించారు. ట్రుత్ సోషల్ అకౌంట్‌లో ఆయన ఈ ప్రకటన చేశారు. ఒకవేళ అన్నీ అనుకూలిస్తే దక్షిణ అమెరికా దేశంలోని ఇంధన నిక్షేపాలను అమెరికా వినియోగించుకోనున్నట్లు చెప్పారు. విదేశాంగ మంత్రి మార్కో రూబియా, రక్షణ మంత్రి పీట్ హేగ్సేత్, వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగేజ్ చర్చల్లో ఆ డీల్ కుదిరినట్లు పేర్కొన్నారుఈ డీల్‌లో భాగంగా 17 ఆయిల్ ఫీల్డ్స్‌ను డెవలప్ చేయనున్నట్లు వెనిజువెలా అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. సుమారు 65 బిలియన్ల బ్యారెళ్ల ఇంధనం వెలికితీసే అవకాశాలు ఉన్నాయి. వెనిజువెలా ఆయిల్ ఇండస్ట్రీలోకి సుమారు వంద బిలియన్ల డాలర్ల పెట్టుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ ఒప్పందం వల్ల పన్నుల రూపంలో సుమారు 209 బిలియన్ల డాలర్లు వసూల్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు వెనిజువెలా సర్కారు తెలిపింది.

# హెచ్-1బీ వీసాదారులపై మరో పిడుగు..

**-60 రోజుల గడువును తొలగించేందుకు యూఎస్ మరో అడుగు**




**వాషింగ్టన్, ఆగస్టు 29 (వార్త సంధ్య**
హెచ్-1బీ కార్మికులపై ట్రంప్ ప్రభుత్వం మరో పిడుగు వేసింది. ఉద్యోగాలు కోల్పోయిన తర్వాత హెచ్-1బీ కార్మికులకు లభించే 60 రోజుల గడువును తొలగించేందుకు ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కీలక నియంత్రణ సమీక్షలో వైట్‌హౌస్ ఆమోదించింది. దీంతో ఈ విధానం అమలుకు మరింత చేరువైంది. బ్లూమ్‌బర్గ్ లా ప్రకారం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రతిపాదనకు ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ అఫయిర్స్ (ఓఐఆర్ఏ) గురువారం ఆమోదం తెలిపింది. దీనిని అమలు చేసేందుకు త్వరలోనే బహిరంగంగా ప్రకటన విడుదల కావచ్చునని తెలిపింది. 2017లో ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం హెచ్-1బీ ప్రత్యేక వృత్తి కార్మికులు ఒకవేళ ఉద్యోగం కోల్పోతే వారు 60 రోజులపాటు లేదా అధికారిక చెల్లుబాటు కాలంవరకు అమెరికాలో ఉండవచ్చు. ఆ వ్యవధిలో వారు కొత్త ఉద్యోగాన్ని వెతుక్కోవడమో లేదా అధికారికంగా దేశంలో కొనసాగడానికి ఉన్న ఇతర అవకాశాలను వెతుక్కోవడమో చేసేవారు. అయితే ఈ ప్రతిపాదిత కొత్త నిబంధన ఇప్పుడా 60 రోజుల వెసులుబాటును తొలగిస్తుంది.

# నా ప్రతిష్ఠను దిగజారిస్తే చేతులు నరికేస్తా!

**నన్ను మంత్రి వర్గం నుంచి తొలగించడానికి కుట్ర**

**కేంద్ర గిరిజన మంత్రి జువల్ ఓరమ్**



**న్యూఢిల్లీ ఆగస్టు 29 (వార్త సంధ్య**
తనను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించడానికి కుట్ర జరుగుతున్నదని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరమ్ ఆరోపించారు. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నించేవారి చేతులు నరికేస్తానని బెదిరించారు. బీజేపీ జనరల్ సెక్రటరీ మానస్ మొహంతీతో భేటీ అనంతరం ఓరమ్ ఈ వ్యాఖ్యలు చేశారు.ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన కొందరు నేతలు తనను బద్నాం చేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నవారు తనను రాజకీయంగా ఎదుర్కొనేందుకు సవాల్ విసురుతున్నారన్నారు.

# ఫుడ్ ప్యాకెట్లపై వార్నింగ్ లేబుల్స్..

**-ఎంత అనారోగ్యకరమో తెలిపే సూచనలు..**
**త్వరలోనే అమలు**



**న్యూఢిల్లీ ఆగస్టు 29 (వార్త సంధ్య**
ప్యాకేజీ ఫుడ్ విషయంలో కొందరు చాలా అప్రమత్తంగా ఉంటారు. తమ పిల్లలకు ప్యాకేజ్డ్ ఫుడ్ ఇవ్వడానికి ఇష్టపడరు. ఎందుకంటే అవి అనారోగ్యకరం అని భావిస్తారు. అయితే, కొందరికి వాటిపై అవగాహన ఉండదు. ఆరోగ్యానికి అవి ఎలాంటి హాని చేస్తాయి అనే విషయం గురించి తెలియదు. అందుకే, ఇకపై ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ప్రత్యేక లేబుల్స్ అందుబాటులోకి రానున్నాయి. ఆ ఫుడ్‌లోని పదార్థాలు, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను సూచించే లేబుళ్లు ఆ ప్యాకెట్లపై ముంద్రించాల్సి ఉంటుంది.దీనికి సంబంధించిన ప్రతిపాదనల్ని 'ద ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)' సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఎఫ్ఓపీఎల్ (ఫ్రంట్ ఆఫ్ ప్యాకెట్ వార్నింగ్ లేబుల్స్)కు సంబంధించి దాఖలైన కేసులో సుప్రీంకోర్టు గతంలో ఎఫ్ఎస్ఎస్ఏఐకి కీలక సూచనలు చేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఆ ఆహారానికి సంబంధించిన ప్రభావాల్ని చూపించే లేబుల్స్ ఉండేలా చూడాలని కోర్టు ఆదేశించింది. దీనివల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇస్తున్న ఫుడ్ ఎలాంటిదో ఒక అంచనాకు రాగలుగుతారు అని కోర్టు అభిప్రాయపడింది. ఈ వార్నింగ్ లేబుల్స్‌ను అమలు చేయడంలో ఎఫ్ఎస్-ఎస్ఏఐ ఆలస్యం చేసింది. దీనిపై స్పందించిన కోర్టు.. ఆహార తయారీ సంస్థలు, కార్పొరేట్ సంస్థల నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐపై ఒత్తిడి ఉన్నట్లు గుర్తించింది. దీనివల్ల ప్రజల ఆరోగ్యం విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా కోర్టుకు ఆరు పేజీల అఫిడవిట్ సమర్పించింది. ఎక్కువ ఉప్పు, ఎక్కువ కొవ్వు, ఎక్కువ చక్కెర ఉండే పదార్థాలున్న ఫుడ్ ప్యాకేజ్‌పై రెడ్ లేబుల్ ఉండేలా చూస్తామని కోర్టుకు తెలిపింది. కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లోని కీలక అంశాలివి. ప్యాకెట్ల ముందు భాగంలో ఆరు కోణాలుండే ఎరుపు రంగు మార్క్ ఉంటుంది. దీనర్థం ఆ ప్రొడక్ట్‌లో అధిక చక్కెర, అధిక ఉప్పు, అధిక కొవ్వు ఉన్నాయని. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఆఫ్ ద ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ 2024లో సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఒక ఉత్పత్తిలోని పోషక విలువల్ని గుర్తిస్తారు. ఈ ప్రమాణాల ప్రకారం అధిక స్థాయిలో హానికర పదార్థాలుంటే రెడ్ లేబుల్ వేస్తారు. ముందు వైపు పెద్ద సైజులో రెడ్ లేబుల్ వేయడం వల్ల అది చాలా హానికరం అని పిల్లలు, తల్లిదండ్రులు గుర్తించే వీలుంది. అయితే, సహజసిద్ధమైన ఉత్పత్తులకు ఈ రూల్ వర్తించదు. అంటే తేనె, నెయ్యి, ఉప్పు, చక్కెర, నూనె వంటి వాటికి మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అఫిడవిట్ సమర్పించింది. దీనిపై మరో 10 రోజుల తర్వాత విచారణ జరగనుంది. ఆ తర్వాత ఈ నిబంధన అమలుపై కోర్టు నిర్ణయం తీసుకుంటుంది.

# ఆ షాకింగ్ వీడియో చైనాలో నిషేధం..




**కాట్మాండు  ఆగస్టు 29 (వార్త సంధ్య**
ప్రకృతి విరుచుకుపడితే ఎలా ఉంటుందో నేపాల్ వరదలు చాటిచెప్పాయి. ఆ మహావిలయం సంభవించినప్పుడు నేపాల్, టిబెట్ బోర్డర్‌లో ఉన్న గిరాంగ్ పోర్ట్ ఇమ్మిగ్రేషన్ సెంటర్ ఆ శక్తివంతమైన వరదలకు సాక్ష్యంగా నిలిచింది. అత్యంత బలమైన బండరాళ్లు, బురద, నీరు ఆ సెంటర్‌పై విరుచుకుపడింది. ఆ వరద ధాటికి అక్కడ ఉన్న వాహనాలు కొట్టుకుపోయాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీసిన జనం ఆ ప్రవాహంలో కన్నుమూశారు. కొండల మధ్య మహోగ్రంగా బురద నీరు మహా ప్రళయం సృష్టించింది. అయితే గిరాంగ్ పోర్ట్ వద్ద ఉన్న సీసీటీవీ కెమెరాలకు ఆ ప్రకృతి పంజా చిక్కిన విషయం తెలిసిందే.ప్రపంచ దేశాలన్నీ ఆ వీడియోను వీక్షించాయి. కానీ డ్రాగన్ దేశం చైనాలో మాత్రం ఆ వీడియోపై నిషేధం ఉన్నది. ఇప్పటికే వరకు ఆ దేశంలో ఈ వీడియోను పబ్లిక్‌గా ప్రదర్శించలేదు. కేవలం ఒకే ఒక్క స్టిల్ ఫ్రేమ్ షాట్ మాత్రమే చైనా మీడియాలో ప్లే చేస్తున్నారు. అక్కడి న్యూస్ బులిటెన్‌లో కూడా ఈ ఫ్రేమ్‌నే రిపీట్ చేస్తున్నారు. కఠినమైన సెన్సార్‌షిప్ ఉన్న చైనా ఇంటర్నెట్‌లో అసలు ఆ వీడియో ఆచూకీ లేదు. ఆకస్మిక వరదలకు చెందిన పోస్టులను అక్కడ సోషల్ మీడియాలో నిషేధించారు. వాస్తవానికి వరదలు వచ్చిన కొన్ని గంటల్లో చైనా సర్కారు భారీ రెస్క్యూ ఆపరేషన్‌కు ఆదేశాలు ఇచ్చింది. వరద విలయం చోటుచేసుకున్న తర్వాత అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. చైనా వైపు కూడా భారీగా నష్టం జరిగినట్లు తెలుస్తున్నా.. అక్కడ నుంచి మాత్రం ఎటువంటి ఆనవాళ్లు కనిపించడం లేదు. గత నాలుగు రోజుల నుంచి ప్రపంచం మొత్తం నేపాల్ వరదలను వీక్షిస్తున్నది, కానీ చైనా ఫైర్‌వాల్ మాత్రం ఆ వీడియోలకు చెక్ పెడుతున్నట్లు తెలుస్తోంది. నేపాల్ విలయం పట్ల చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పందించారు. నేపాల్ అధ్యక్షుడు రాంచంద్ర పౌడెల్‌తో మాట్లాడారు. వరద బాధిత కుటుంబాలకు చైనా అధ్యక్షుడు సంతాపం తెలిపారు. రెండు దేశాల ప్రజలు చేతులు కలిపి ఈ విపత్తును అధిగమిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరగా తమ ఇండ్లను పునర్ నిర్మిస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఢిల్లీలో పెరిగిన సీఎన్‌జీ ధరలు.




**న్యూఢిల్లీ ఆగస్టు 29 (వార్త సంధ్య**
దేశ రాజధాని ఢిల్లీ తోపాటు దాని పరిసర ప్రాంతాలైన నేషనల్ క్యాపిటల్ రీజియన్  పరిధిలో కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ వాహనదారులపై అదనపు భారం మోపింది. సీఎన్‌జీ ధరను కిలోకు రూ.3.89 మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి.తాజా ధరల పెరుగుదలతో ఢిల్లీలో కిలో సీఎన్జీ ధర రూ.86.98 కి చేరింది. అదేవిధంగా నోయిడా, ఘజియాబాద్‌లలో రూ.95.59 గా, గురుగ్రామ్‌లో రూ.92.01 గా కొత్త ధరలు ఖరారయ్యాయి. మీరట్, ముజఫర్‌నగర్, షామ్లీ వంటి ప్రాంతాల్లోనూ పెరిగిన ధరలు అమలవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) ధరలు గణనీయంగా పెరగడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సీఎన్జీ ఉత్పత్తి కోసం అవసరమైన సహజ వాయువును ప్రధానంగా ఎల్ఎన్‌జీ రూపంలోనే దిగుమతి చేసుకుంటున్నారు. హార్ముజ్ జలసంధి గుండా సాగే ఇంధన రవాణాలో ఆటంకాలు ఏర్పడటం, శీతాకాలం దృష్ట్యా ఐరోపా దేశాలు తమ నిల్వలను పెంచుకోవడం వంటి పరిణామాల వల్ల సరఫరా వ్యయం పెరిగింది. పశ్చిమాసియా సంక్షోభం తలెత్తిన తర్వాత, మే 15 నుంచి ఇప్పటివరకు సీఎన్జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. ఈ ధరల పెంపు ప్రభావం ప్రైవేట్ కార్లు, ట్యాక్సీలు, ఆటోరిక్షాలు సహా వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయంపై పడనుంది. పెరిగిన ఇంధన ఖర్చుల భారాన్ని వాహనదారులు ప్రయాణికులపై మోపే అవకాశం ఉంది. రవాణా ఛార్జీలు కూడా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# వెనక్కు తగ్గిన నేపాల్..

**సహాయక చర్యల్లో పాల్గొనేందుకు విదేశాలకు అనుమతి**



**న్యూఢిల్లీ ఆగస్టు 29 (వార్త సంధ్య**
విదేశీ రెస్క్యూ బృందాలు తమ దేశం వచ్చి సహాయం చేయడానికి నేపాల్ అంగీకరించని సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఈ విషయంతో నేపాల్ తన నిర్ణయం మార్చుకుంది. విదేశీ సహాయక బృందాలను అంగీకరించాలని నిర్ణయించింది. అయితే, పరిమితంగా మాత్రమే విదేశీయుల్ని అనుమతిస్తామని నేపాల్ పేర్కొంది. బుధవారం నేపాల్‌లో భారీ వరద సంభవించడంతో 600 మంది వరకు మరణించగా, మరో 1,500 మంది వరకు గల్లంతయ్యారు.వారిని గుర్తించేందుకు నేపాల్ రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ, ఇంకా చాలా మంది ఆచూకీ దొరకలేదు. ఇదే సమయంలో తమ బృందాల్ని సహాయక చర్యల కోసం పంపిస్తామని ఇండియాతోపాటు అమెరికా వంటి దేశాలు చెప్పాయి. అయితే, తమకు ఏ దేశ సహాయం అవసరం లేదని, తమ దేశంలోని రెస్క్యూ బృందాలే ఈ చర్యలు చేపట్టగలవని నేపాల్ తెలిపింది. గాలింపు, సహాయక చర్యల కోసం విదేశాల సాయాన్ని తిరస్కరించింది. అయితే, తమ దేశానికి ఆర్థిక సాయం అందించవచ్చని మాత్రం కోరింది. అది కూడా దేశంలోని సహాయనిధికి అందించాలని సూచించింది. కానీ, నేపాల్ తమ సాయాన్ని తిరస్కరించడంపై విదేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఇదే సమయంలో అక్కడ సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. అనుకున్నట్లుగా సహాయక చర్యలు కొనసాగడం లేదు. అక్కడి సిబ్బంది శక్తికి మించిన భారంగా మారింది. పరిస్థితి ఊహించినదానికంటే భిన్నంగా ఉంది. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా గల్లంతైన వారిని గుర్తించడంలో నేపాల్ విఫలమైంది. అటు విదేశాల నుంచి సాయం కోసం ఒత్తిళ్లు.. ఇటు సహాయక చర్యలు సరిగ్గా కొనసాగకపోవడంతో నేపాల్ కాస్త వెనక్కు తగ్గింది. రెస్క్యూ చర్యల కోసం విదేశాలకు అనుమతించింది. "గాలింపు, సహాయక చర్యల కోసం తమ బృందాలను పంపించేందుకు విదేశాల నుంచి భారీ స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇదే సమయంలో కొన్ని దేశాలకు చెందిన పౌరులు కూడా గల్లంతయ్యారు. తమ వారిని గాలించేందుకు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయి. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో అర్హులైన కొందరు నిపుణుల్ని అనుమతిస్తున్నాం" అని నేపాల్ ప్రకటించింది. నేపాల్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ఇంకో కారణం ఉంది. నేపాల్ వరదల్లో గల్లంతైన వారిలో ఇండియాతోపాటు పలువురు చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. వారిని రక్షించడంలో నేపాల్ ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించడం లేదు. ఈ నేపథ్యంలో ఆయా దేశాలు నేపాల్‌పై ఒత్తిడి తేవడంతో, నేపాల్ విదేశీ సహాయక బృందాలకు అనుమతించింది.

వార్త సంధ్య
vaartha sandhya
vaarthasandhya@gmail.com epaper.vaarthasandhya.com

# యూట్యూబ్‌లో దూసుకుపోతున్న సుమంత్ 'మహేంద్రగిరి వారాహి' ట్రైలర్

టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు.పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.






## కియారా అద్వానీ హాట్ బాంబ్..

# ఆ హీరో అంటే పిచ్చి.. అతనితో మూవీ డేట్‌కు వెళ్తా..!

### -ఓపెన్‌గా చెప్పిన మీనాక్షి



టాలీవుడ్‌లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకుపోతోంది పంజాబీ ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. 'హిట్ 2', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', అనగనగా ఒక రాజు వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంటూ ఇండస్ట్రీలో 'లక్కీ ఛామ్'గా మారిపోయింది. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్‌లోనూ విజయ్ దళపతి సరసన నటించి అక్కడి ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఆచి తూచి సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. కాగా గతంలో ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో.. "ఒకవేళ మీరు సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా 'మూవీ డేట్' (సినిమాకు వెళ్లడం) కి వెళ్లాల్సి వస్తే.. ఎవరిని ఎంచుకుంటారు?" అని యాంకర్ అడగ్గా ఆసక్తికర సమాధానం చెప్పింది.ఆ ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం తడుముకోకుండా, ఎంతో ఉత్సాహంగా కోలీవుడ్ స్టార్ హీరో శింబు పేరును చెప్పింది. "నేను మూవీ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఖచ్చితంగా శింబు సార్‌తోనే వెళ్తాను" అంటూ చాలా ఎగ్జైటింగ్‌గా సమాధానం ఇచ్చింది. శింబు స్క్రీన్ ప్రెజెన్స్, ఆయన నటన అంటే తనకు చాలా ఇష్టమని ఈ బ్యూటీ పేర్కొంది. శింబుపై మీనాక్షి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.గతంలో శింబు, మీనాక్షి ప్రేమలో ఉన్నారంటూ వార్తలు వచ్చాయి. కానీ దీని పై ఇద్దరూ స్పందించలేదు. అయితే ఇప్పుడు శింబుతోమూవీ డేట్‌కువెళ్తా అని మీనాక్షి చెప్పడంతో ఫ్యాన్స్ అవాక్అవుతున్నారు . ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలపై హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఒక సినిమా వస్తే చూడాలని ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. కాగా, ప్రస్తుతం కోలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం... దర్శకుడు అశ్వత్ మరిముత్తు నేతృత్వంలో శింబు నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'ఎం= 49' లో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేసినట్లు టాక్ నడుస్తోంది.

# కింగ్ 100 గ్లింప్స్ విడుదల..


### పవర్ ఫుల్ డైలాగ్‌తో హీరో పరిచయం

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు.గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్లు గ్లింప్స్ తో తెలియజేశారు.




# టాలీవుడ్‌లో తెలంగాణ జానపదాల హోరు..

### 'రాములో రాముల, సారంగదరియా.. యెష నాగుల కట్ట' అన్నీ హిట్సే..!



తెలంగాణ సంప్రదాయాలు, ఇక్కడి పల్లెపదాలకు టాలీవుడ్ జై కొడుతోంది. మన ప్రాంతంలోని ఆచార వ్యవహారాలకు భావోద్వేగాలు జోడించిన వేణు ఎల్దండి 'బలగం' సినిమా ఎంతపెద్ద హిట్టో తెలిసిందే. ఇప్పుడు వేణు ఎల్లమ్మతో వస్తుండగా.. తెలంగాణ ఈ ప్రాంత చరిత్రతో తెరకెక్కిన 'రాజన్న', 'ఛాంపియన్' వంటి చిత్రాలు ఆదరణ పొందగా.. తెలంగాణ యాసతో వరసగా హిట్స్ అందుకున్నారు విజయ్ దేవరకొండ, సిద్ధూ జొన్నలగడ్డ. ఇదే ఒరవడికి కొనసాగింపుగా.. మన జానపదాలు ఈమధ్య వెండితెరపై ప్రభంజనం సృష్టిస్తున్నాయి.తెలంగాణ ప్రజలు మాత్రమే పాడుకునే, విని తరించే హిట్ జానపదాలను ఏరికోరి సినిమాలో పెడుతున్నారు దర్శకులు. కొన్నింటికి స్వరకర్తలు కొత్త బాణీలు కడుతుండగా.. హీరోలతో కొరియోగ్రాఫర్లు మాస్ స్టెప్పులేయిస్తున్నారు. 'లవ్ స్టోరీ' చిత్రంలో 'సారంగదరియా' సాంగ్ బ్లాక్‌బస్టరైంది. నాగచైతన్య హీరోగా, శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించి ఈ సినిమాలోని ఈ పాటకు సాయి పల్లవి నృత్యం ప్లస్ అయింది.ఇక 'అల వైకుంఠపురం'లో మంగ్లీ పాడిన రాములో రాముల పాట ఎంత హిట్టో తెలిసిందే. తెలంగాణ పదాలను, యాసను మేళవిస్తూ కాసర్య శ్యామ్ రాసిన ఈ పాటకు.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, పూజా హెగ్డే స్టెప్పులు ఇరగదీశారనుకో. ఇప్పటికే ఈ పాట యూట్యూబ్‌లో 79 కోట్లకు పైగా వ్యూస్ సాధించింది.మెగాస్టార్ చిరంజీవి 'భోళా శంకర్' చిత్రంలో 'నర్సపల్లి గండిలోన గంగధారి ఆడి నెమలి ఆటలకు గంగధారి' అనే జానపద లైన్స్ తీసుకున్నారు. ఈ సాంగ్‌కు చిరంజీవి, తమన్నా, కీర్తి సురేశ్ డ్యాన్స్ కుమ్మేశారు. రవితేజ 'రాజా ది గ్రేట్' సినిమాలోని 'గున్నా గున్నా మామిడి' సాంగ్ ఎంత పాపులరో తెలిసిందే. ప్రస్తుతం. నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ప్యారడైజ్' సినిమాలో 'యెష నాగుల కట్ట మీద యేసిన ఉయ్యాల' పాటను తీసుకున్నారు. తాజాగా దీనికి సంబంధించిన లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదలైంది.నాని, కీర్తి సురేశ్‌లు ఈ సాంగ్‌కు వేసిన మాస్ స్టెప్పులు.. ఈ ఫోక్ సాంగ్‌ను మరింతగా జనాల్లోకి తీసుకెళ్లడం ఖాయం. ఒకప్పుడు టేపు రికార్డర్‌లో విన్న ఈ పాటలు.. యూట్యూబ్ ఛానెళ్ల పుణ్యమాని ఈతరానికి కూడా చేరువయ్యాయి. కథను బట్టి.. ఈ ప్రాంత విశిష్టతను చాటుతున్న ఈ ఫోక్ సాంగ్స్ ట్రెండ్ సినిమా హిట్ ఫార్ములాలో భాగమైపోయింది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.